# తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త






## మెడలో మువ్వలదండలతో కాళ్ళకు గజ్జెలతో అధికార నందివాహనం



తిరుపతి, ఫిబ్రవరి 23ప్రభాతవార్త: కపిలేశ్వరస్వామికి జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో ఆదివారం రాత్రి అధికార నంది వాహనంపై సోమస్కంధ మూర్తిగా కపిలేశ్వరుడు భక్తులకు అభ యమిచ్చాడు. కపిలేశ్వరస్వామి వాహనసేవలలో అధికారనంది వాహనం ప్రముఖం. ఈ అధికార నందికి కైలానంది అని పేరు. కైలాసంలో మెడలో మువ్వలదండలతో ,కాళ్ళకు గజ్జెలతో,భక్తులకు అడుగడుగునా కర్పూర హారతులు సమర్పించారు. ఉదయం బ్రహ్మోత్సవాల్లో సోమస్కంధమూర్తిగా కామాక్షి అమ్మవారితో కలసి తిరుచ్చివాహనంపై ఊరేగారు. ఈ వాహనసేవలో ఆలయ డిప్యూటీ ఈఓ దేవేంద్రబాబు, ఏఈఓ సుబ్బరాజు, సూపరింటెండెంట్ చంద్రశేఖర్, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

## కాణిపాకం ఆలయానికి 4.50 లక్షలు విరాళం



కాణిపాకం, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామివారి దేవస్థానంలో అమలవుతున్న వివిధ అభివృద్ధి పథకాలకు ఓ భక్తుడు ఆదివారం 4.50 లక్షల రూపాయలను విరాళంగా అందజేశారు. ఈమేరకు నెల్లూరుకు చెందిన జి.శ్రీనివాసులురెడ్డి అనే భక్తుడు దేవస్థానంలో అమలవుతున్న శాశ్వత నిత్యాన్నపథకానికి 2,50,232 రూపాయలను, శ్రీసిద్ధి వినాయక గోసంరక్షణ ట్రస్ట్‌కు రెండు లక్షల రూపాయలను విరాళంగా అందించారు. ఈమొతాన్ని దాత కుటుంబసభ్యులతో కలసి ఆలయ ఏఈఓ రవీంద్రబాబుకు .దాతలకు ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి తీర్థ, ప్రసాదాలను అందజేశారు. ఈకార్యక్రమంలో టెంపుల్ ఇన్స్‌పెక్టర్ విఘ్నేష్, దాత కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

## పకడ్బందీగా ఇంటర్, టెన్త్ పరీక్షల నిర్వహణ ఏర్పాట్లు

**టెన్త్ పరీక్షల్లో కాపీయింగ్ కట్టడి చేయడానికి 18 ఫ్లయింగ్ స్క్వాడ్‌లు**

**7 హైసెన్సిటివ్ పరీక్షా కేంద్రాల్లో సిసి కెమెరాలు ఏర్పాటు**

**పరీక్షా కేంద్రాల పరిసరాల్లో 144 సెక్షన్ అమలు: కలెక్టర్**



చిత్తూరు, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త: జిల్లాలో మార్చి 1 నుండ 20 తేదీ వరకు ఇంటర్మీడియేట్ పరీక్షలు, మార్చి 17 నుండి ఏప్రిల్ 1వ తేదీ వరకు నిర్వహించే టెన్త్ పరీక్షల నిర్వహణకు జిల్లా అధికార యంత్రాంగం పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టి పూర్తి చేసినట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ పేర్కొన్నారు. మార్చి 1 నుండి 20వ తేదీ వరకు జరిగే ఇంటర్మీడియేట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్షలకు మొత్తం 30,652 మంది విద్యార్థులు హాజరు అవుతున్నారని, ఇందులో మొదటి సంవత్సరం ఇంటర్మీడియేట్‌కు సంబంధించి 15,482 మంది విద్యార్థులు, రెండవ సంవత్సరం ఇంటర్మీడియేట్‌కు సంబంధించి 15,170 మంది విద్యార్థులు హాజరు అవుతున్నారన్నారు. ఇంటర్మీడియేట్ విద్యార్థులకు ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్దేశించిన పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు జరుగుతాయని, జిల్లా వ్యాప్తంగా ఇంటర్మీడియేట్ పరీక్షలకు 50 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అలాగే జిల్లాలో మార్చి 17 నుండి ఏప్రిల్ 1వ తేదీ వరకు టెన్త్ పరీక్షలు జరుగనున్నాయని, ఈ పరీక్షలు ఉదయం 9.30 గంటల నుండి మధ్యాహ్నం 12.45 గంటల వరకు వుంటాయన్నారు. టెన్త్ పరీక్షల నిర్వహణ కోసం జిల్లా వ్యాప్తంగా 118 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఇందులో 'ఏ' కేటగిరి పరీక్షా కేంద్రాలు 38, 'బి' కేటగిరి పరీక్షా కేంద్రాలు 37, 'సి' కేటగిరి పరీక్షా కేంద్రాలు 43 వున్నాయన్నారు. టెన్త్ పరీక్షలకు మొత్తం 21,248 మంది విద్యార్థులు హాజరు కానన్నారన్నారు. ఇందులో రెగ్యులర్ విద్యార్థులు 20,954 మంది వుండగా ఇందులో బాలురు 10,802, బాలికలు 10,152 మంది వున్నారన్నారు. అలాగే టెన్త్ పరీక్షలకు 294 మంది ప్రైవేటు విద్యార్థులు వుండగా ఇందులో 203 మంది బాలురు, 91 మంది బాలికలు వున్నారన్నారు. టెన్త్ పరీక్షల్లో కాపీయింగ్‌ను పూర్తి స్థాయిలో అడ్డుకట్ట వేయడానికి 18 ఫ్లయింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

## భూతవాహనంపై కైలాసనాధుడు శుక వాహనంపై మన్మోణి



భూత, శుకవాహనాలపై స్వామిఅమ్మవార్ల దర్శనం

శ్రీకాళహస్తి,ఫిబ్రవరి 23 ప్రభాతవార్త శ్రీకాళహస్తీశ్వరుని సన్నిధిలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల ఊరేగింపుల్లో ఈ ఏడాది అలంకారాలకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చినట్లు తెలుస్తుంది. ఆదివారం రాత్రి ఉత్సవంలో స్వామి అమ్మవార్ల అలంకారాలను తిలకించిన భక్తులు మంత్రముగ్ధులయ్యారు.కైలాసనాధుడు భూతనాధుడని చెబుతారు. ఈ నేపధ్యంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో ఒక్కొక్కరోజు ఒక్కొక్క వాహన సేవను నిర్వహిస్తారు. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి ముక్కంటీశుడు భూతవాహనంపై, దేవేరి జ్ఞాన ప్రసూనాంబ అమ్మవారు శుక వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. స్వామి భూత వాహనంపై ఆశీనుడు కాగా పరిచారకులు వింజామరలు వీస్తుండగా తన దివ్య తేజాన్ని తన భక్తులకు దర్శనమిస్తూ కైలాసనాధుడు పురవీధుల్లో దర్శనమిచ్చారు. భోళా శంకరుడు భూతనాధుడు కాబట్టి శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో రెండోతిరునాళ్ళలో రాత్రి ఆయన్ను భూత వాహనంపై ఊరేగిస్తారు. అలాగే అమ్మవారిని శుక వాహనంపై ఊరేగించారు.స్వామి అమ్మవార్లను ఎంతో చక్కగ అలంకరించి వాహనాల మండపం వద్దకు చేర్చారు.ఉత్సవం సకాలంలో ప్రారంభం అవుతుండటంతో భక్తులు విశేష సంఖ్యల్లో హాజరై స్వామిఅమ్మవార్లను దర్శించుకున్నారు. మేళాతాళాలు, మంగళవాయిద్యాలతో పాటు పెంటయ్య బ్యాండుమేళాలు ప్రత్యేక ఆకర్షణగా మారింది. సుమారు రెండున్నర గంటల పాటు ఉత్సవం సాగింది. ఉభయదాతలు హరిజన గిరిజన సంఘం నాయకుడు పసల రమణయ్య మరియు వారి సంఘ సభ్యులు పాల్గొన్నారు. కార్యక్రమంలో బొజ్జలబృందమ్మ, రంగినేని చెంచయ్యనాయుడు, మిన్నల్‌రవి, హరి, డాక్టర్ గెరటారెడ్డి, టెంపుల్ ఇన్స్‌పెక్టర్లు హరియాదవ్, దఫేధార్ రాజ, భద్రయ్యలు పాల్గొన్నారు.

## టిటిడి బోర్డు ఎక్స్‌అఫిషియో సభ్యుడిగా వినయ్‌చంద్ ప్రమాణం



తిరుమల, ఫిబ్రవరి 23ప్రభాతవార్తప్రతినిధి: శ్రీవేంకటేశ్వరస్వామి భక్తులకు సేవకుడిగా సేవచేసే అవకాశం కలగడం తన అదృష్టంగా భావిస్తున్నట్లు రాష్ట్రదేవాదాయశాఖకార్యదర్శి ,టిటిడి బోర్డు ఎక్స్‌అఫిషియో సభ్యుడు వాడరేవు వినయ్‌చంద్ తెలిపారు. ఎక్స్‌అఫిషియోసభ్యుడుగా నియమితులైన ఆయనతో ఆదివారం ఉదయం టిటిడి అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి ప్రమాణస్వీకారం చేయించారు.

## ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఘన స్వాగతం.. వీడ్కోలు







రేణిగుంట, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త. రాష్ట్ర ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడుకు రేణిగుంట విమానాశ్రయంలో ఆదివారం ఉదయం ఘన స్వాగతం మధ్యాహ్నం ఘనంగా వీడ్కోలు లభించింది. రేణిగుంట మండలం తూకివాకం ఓ ప్రైవేటు కళ్యాణం మండపలో యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్ కుమారుడి వివాహ వేడుకలో పాల్గొనడానికి ముఖ్యమంత్రి రేణిగుంట విమానాశ్రయం చేరుకున్నారు. విమానాశ్రయంలో ఆయనకు డీఐజీ షిమోషి బాజ్పాయ్, జిల్లా కలెక్టర్ డా. వెంకటేశ్వర్, జిల్లా ఎస్పీ హర్షవర్థన్ రాజు, తిరుపతి మునిసిపల్ కమిషనర్ మౌర్య, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, టీటీడీ అదనపు ఈఓ వెంకయ్య చౌదరి, పలమనేరు, చంద్రగిరి, సత్యవేడు, నగరి, గంగాధర్ నెల్లూరు ఎమ్మెల్యేలు అమర్నాథ్ రెడ్డి, పులివర్తి వెంకట ముని ప్రసాద్(నాని), కోనేటి ఆదిమూలం, భాను ప్రకాష్, డా. వి.యం థామస్, టీటీడీ బోర్డు సభ్యులు శాంతారాం, శ్రీకాళహస్తి ఆర్డిఓ భాను ప్రకాష్ రెడ్డి, తదితర ప్రజాప్రతినిధులు, అధికారులు స్వాగతం పలికారు. విమానాశ్రయం వెలుపల ముఖ్యమంత్రి ప్రజలకు, అభిమానులకు అభివాదం చేసి వారిచ్చిన అర్జీలు స్వీకరించారు.అనంతరం ముఖ్యమంత్రి రేణిగుంట మండలం తూకివాకం కళ్యాణమండపంకు రోడ్డు మార్గాన బయలుదేరి వెళ్లారు. కళ్యాణ మండపం నందు జిల్లా యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్ కుమారుని వివాహ వేడుకల్లో పాల్గొని తరువాత రోడ్డు మార్గంలో రేణిగుంట విమానాశ్రయం చేరుకుని ఆపై హెలికాప్టర్లో శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కనుపర్తి పాడుకు జిల్లాకు చెందిన వివిధ శాఖల అధికారులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు, అభిమానులు వీడ్కోలు పలుకుతుండగా బయలుదేరి వెళ్లారు.

## ప్రశాంతంగా ముగిసిన గ్రూప్-2 మెయిన్ పరీక్షలు

**పరీక్షా కేంద్రాలను ఆకస్మిక తనిఖీలు చేసిన కలెక్టర్**



తిరుపతి కలెక్టరేట్, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త : ఏపీపీఎస్సీ గ్రూప్-2 మెయిన్స్ పరీక్షలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించినట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ తెలిపారు. ఆదివారం ఉదయం 10 నుంచి 12.30 గంటల వరకు రెండు సెషన్లలో పరీక్షల నిర్వహణ జరిగిందని, తిరుపతిలో నిర్వహించిన 13 పరీక్షా కేంద్రాలలో ఈ పరీక్షలకు 5801 మంది అభ్యర్థులు రాయాల్సి ఉండగా ఉదయం పేపర్ 1 పరీక్షకు 5055 మంది హాజరు కాగా 87.14 శాతంగా, మధ్యాహ్నం పేపర్ 2 పరీక్షకు 5046 మంది హాజరుకాగా 86.99 శాతం మంది పరీక్షకు హాజరు అయ్యారని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ కొన్ని పరీక్షా కేంద్రాలను ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఏపీపీఎస్సీ నిబంధనల మేరకు అన్ని విధాల పకడ్బందీ చర్యలు చేపట్టి పరీక్షలు నిర్వహించామని, అన్ని శాఖ సమన్వయంతో పరీక్షలు విజయవంతంగా నిర్వహించడం జరిగిందని కలెక్టర్ తెలిపారు.

### పెండ్లి పీటల నుంచి నేరుగా గ్రూప్2 పరీక్షకు....



తిరుపతి విద్య, ఫిబ్రవరి 23 ప్రభాత వార్త శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో అరుదైన దృశ్యం వీక్షకులను ఆకట్టుకుంది.గ్రూప్2 మెయిన్స్ పరీక్షలో భాగంగా శనివారం ఎస్పీడబ్లూ కళాశాల పరీక్షా కేంద్రానికి నవవధువు పెళ్లిదుస్తులతో, తలపై జీలకర,బెల్లం పెట్టుకుని చేతిలో హాల్ టికెట్‌తో హాజరైంది.చిత్తూరు పట్టణంలో శనివారం ఉదయం 6గంటలకు వివాహ ప్రక్రియ పూర్తి చేసుకున్న నవవధువు మమత నేరుగా పెళ్లి దుస్తులతో పరీక్షకు హాజరైంది.దీంతో పరీక్షా కేంద్ర వద్ద పోలీసలు అధికారులు ఆమెకు శుభాకాంక్షలు తెలుపుతూ పరీక్ష బాగారాయాలంటూ బెస్ట్ ఆఫ్ లక్ చెప్పారు.పరీక్షకు హాజరైన అభ్యర్థులు సైతం ఆమె వైపు తదేకంగా చూడటం కనిపించింది. దీంతో పరీక్షా కేంద్రం వద్ద ఆమె ఓ అట్రాక్షన్ గా నిలిచింది.

## ప్రియభక్తుడి భుజస్కంధాలపై శ్రీరామచంద్రుడు





చంద్రగిరి, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త: ప్రియభక్తుడైన హనుమంతుని వాహనంగా చేసుకుని శ్రీరామచంద్రుడి అవతారంలో కళ్యాణ వెంకన్న తిరుమాడ వీధులలో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీనివాస మంగాపురంలో వెలసియున్న శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం స్వామి వారిని సుప్రభాతసేవతో మేల్కొలిపితోమాలసేవ,నిత్యకైంకర్యాలను నిర్వహించారు.

**గజవాహనంపై శ్రీనివాసుడు**

ఐశ్వర్యానికి ప్రతీకగా నిలిచే గజరాజును వాహనంగా చేసుకుని శ్రీనివాసుడు తిరుమాడ వీధులలో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. కల్యాణ వెంకన్న బ్రహ్మోత్సవాలలో ఆదివారం రాత్రి గజవాహన సేవ కన్నుల పండువగా సాగింది. ఈ వాహన సేవలో ఎంఎల్ఏ పులివర్తి నాని, పులివర్తి సుధారెడ్డి, అదనపు ఈఓ సిహెచ్ వెంకన్న చౌదరి, జెఈఓ వీరబ్రహ్మం, ఆలయ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, విద్యుత్ డిఈఈ భాస్కర్, సివిల్ డిఈఈ దామోదరం, ఏఈఓ ఎం. గోపినాథ్, ఆలయ ప్రధాన అర్చకుడు బాలాజీ రంగాచార్యులు, పార్థసారధి, విద్యుత్ ఏఈఈ బాలకృష్ణమూర్తి, సివిల్ ఏఈఈ చంద్రశేఖర్, సూపరింటెండెంట్లు వలిశెట్టి రమేష్‌బాబు, రాజ్‌కుమార్, పి.మునిబాలకుమార్, టెంపుల్ ఇన్ స్పెక్టర్ ద్వారక మునికుమార్, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ అనుంబట్టు ధనశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

## అధికార నంది వాహనంపై ఆది దేవుని దివ్యసంచారం



నాగలాపురం, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త: నాగలాపురం మండలం సురుటుపల్లిలో శ్రీ సర్వమంగళ సమేత పల్లికొండేశ్వర స్వామి ఆలయంలో జరుగుతున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఆది దేవుడైన పరమేశ్వరుడు అధికార వాహనంపై దివ్య సంచారం చేస్తూ భక్తులను సమ్మోహన పరచారు. 6వ రోజు ఆదివారం శ్రీ పార్వతీ, పరమేశ్వరులకు కార్తీకేయ గురుకుల్ ఆధ్వర్యంలో అర్చకుల వేదమంత్రాలు, మంగళ వాయిద్యాలు నడుమ శాస్త్రోక్తంగా జరిపారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వయంభు వెలసిన వాల్మీకేశ్వర స్వామికి, మరగదాంబిగా అమ్మవారికి దాంపత్య దక్షిణామూర్తికి, శ్రీ పల్లికొండేశ్వర స్వామివార్లకు ప్రత్యేక అభిషేక పూజలు సాంప్రదాయ బద్ధంగా నిర్వహించి సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. సాయంత్రం 7 గంటలకు అధికార నంది వాహనంపై శ్రీ పరమేశ్వరుని, పల్లకి వాహనంలో శ్రీ పార్వతీ దేవిని అధీష్టించి భక్తులను కటాక్షించారు. అధికార నంది వాహన సేవ ఉభయదారుగా ఊత్తుకోటకు చెందిన శ్రీ పల్లికొండేశ్వరాలయ మాజీ చైర్మన్ ఏవీఎం మునిచంద్రశేఖర్‌రెడ్డి, ఏవీఎం బాలాజీరెడ్డి కుటుంబ సభ్యులు వ్యవహరించారు. బ్రహ్మోత్సవ ఏర్పాట్లను ఆలయ ఈవో లత, సిబ్బంది పర్యవేక్షించారు.

## వైసిపిలో మరో చిలిపికృష్ణుడు

**-స్పాసెంటర్‌లో పోలీసులకు జిక్కిన ఎస్టీకమిషన్ సభ్యుడు శంకర్‌నాయక్**



తిరుపతి,ఫిబ్రవరి 23ప్రభాతవార్త: స్పా సెంటర్ ముసుగులో వేశ్యావృత్తిలో ఉన్న రాష్ట్ర ఎస్టీకమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్‌నాయక్ పోలీసులకు పట్టుబడటం ఉమ్మడి చిత్తూరుజిల్లాలో సంచలనంగా మారింది. ఇప్పటికే గత ఐదేళ్ళ వైసిపిలో కొందరు నేతలు చిలిపికృష్ణులుగా మారి పలు రకాల రాసలీలల బాగోతంలో బుక్ అయిన విషయం విదితమే. ఈ వడిత్యాశంకర్‌నాయక్ గతంలో దశాబ్దకాలంపాటు విద్యార్థిసంఘ నేతగా ,జివిఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడుగా మాత్రమే విద్యార్థులకు, ప్రొఫెసర్లకు ఎరిగిన వ్యక్తి. ఆ తరువాత 2019లో వైసిపి రాష్ట్రంలో అధికారంలోకి రావడంతో చంద్రబాబునాయుడుపై పెద్ద ఎత్తున విమర్శలు చేయడం, గతంలో ఆయనకు వ్యతిరేకంగా గిరిజన విద్యార్థులతో కలసి మాటల యుద్ధం చేశాడు. ఆయన గత ఐదేల్ళుగా ఎస్టీకమిషన్ సభ్యుడుగానే కొనసాగుతున్నాడు. తాజాగా విజయవాడ మాచవరం పోలీసుస్టేషన్ పరిధిలో స్టూడియో 9 పేరుతో నిర్వహిస్తున్న స్పా సెంటర్‌లో శంకర్‌నాయక్ వ్యభిచారం ముసుగులో పట్టుబడటంతో అటు అనంతపురం జిల్లాలో ఇటు తిరుపతి జిల్లాలో దుమారం రేపింది. సిఐ ఎన్.ప్రకాష్ అదుపులోకి తీసుకున్న వారందరినీ స్టేషన్ బెయిల్ ఇచ్చి పంపడం కొసమెరుపు. కాగా శంకర్‌నాయక్ బాగోతంపై వైసిపి నాయకులు ఎవరూ కూడా స్పందించకపోవడం గమనార్హం. ఎస్టీ కమిషన్ సభ్యుడు పదవిలో ఉంటూ ఈబాగోతంలోకి రావడంతో విచిత్రంగా మారింది.

## పుంగనూరుకు మహర్దశ



**- 5 ప్రముఖ కంపెనీల పరిశ్రమల రాక**

**- 40 వేల మందికి ఉద్యోగ అవకాశాలు**

పుంగనూరు, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త రాష్ట్రానికి చివరగా ఉంటూ చిత్తూరు జిల్లాలో ఎంతో వెనుకబడిన, వర్షధారమే తప్ప ఎటువంటి జీవనదులు లేని పుంగనూరుకు రాష్ట్ర ప్రభుత్వం మహర్దశ పట్టనుంది. కర్ణాటక సరిహద్దులోని పుంగనూరు ప్రాంతంలో 2000 ఎకరాలలో ఐదు భారీ పరిశ్రమలు ఏర్పాటయ్యేందుకు కసరత్తు జరుగుతోంది. పుంగనూరు నుంచి ములభాగల్ వెళ్లే దారిలో ఉన్న ప్రాంతమంతా పరిశ్రమలకు అనుగుణంగా ఉండడంతో రెండు వేల ఎకరాల భూములు కొనుగోలుకు రంగం సిద్ధమవుతోంది. ఈ భూములలో క్యూంగ్ సంగ్, టిసంగ్, ఇండియా ఎలక్ట్రానిక్స్, హేయింగ్ సంగ్, పెప్పర్ మోషన్ కంపెనీలు పరిశ్రమలు ఏర్పాటు చేయనున్నారు. ఈ కంపెనీల యాజమానులు, సీఈఓ లతో సీనియర్ ఐఏఎస్ అధికారి ప్రద్యుమ్న చర్చలు జరుపుతున్నట్లు తెలుస్తోంది. పరిస్థితులు అన్నీ అనుకూలిస్తే వచ్చేనెల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ పరిశ్రమలకు భూమి పూజ చేయనున్నారు. గతంలో కొందరు పెద్దలు ఈ కంపెనీలన్నీ బయట రాష్ట్రాలకు వెళ్లిపోయేలా ప్రయత్నం చేయగా,మాజీ ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి పట్టుదలతో ప్రయత్నించి కంపెనీలను పుంగనూరులోనే ఏర్పాటు చేసేందుకు చేసిన కృషి శ్లాఘనీయం. ఎలాగైనా పుంగనూరు ప్రాంతంలో పరిశ్రమలు ఏర్పాటు చేయాలని ఆ కంపెనీ సీఈఓలతో మాజీ ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి, నియోజకవర్గ టిడిపి యువనేత దొమ్మలపాటి నగేష్ బాబు ( ఆర్ వి టి బాబు ) చేసిన కృషి ఫలించింది. ఈ ప్రాంతంలో పరిశ్రమలు ఏర్పాటయితే సుమారు 40 వేల మందికి ఉపాధి లభించనున్నది. ఇందులో 50శాతం స్థానికులకే ఉద్యోగాలు ఇవ్వనున్నారు. దీంతో నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు రానున్నాయి. ఇప్పటికే పెప్పర్ కంపెనీ రాష్ట్ర ప్రభుత్వానికి రూ. 50 కోట్లు చెల్లించింది. ఈ ఒక్క కంపెనీనే 900 ఎకరాల్లో పరిశ్రమలు, 300 ఎకరాల్లో ట్రాక్ ఏర్పాటు చేయనున్నారు. ఎన్నో ఏళ్లగా ఒకే కుటుంబానికి చెందిన వారు ఇక్కడ ఎమ్మెల్యేలుగా ఉన్న అభివృద్ధి విషయంలో పట్టించుకోలేదని విమర్శలు ఉన్నాయి. ఈ దశలో అనేక కంపెనీలు పుంగనూరు ప్రాంతంలో పరిశ్రమలు ఏర్పాటు చేసి నిరుద్యోగ సమస్యను పరిష్కారం చేయనున్నారు. ఒకరకంగా పుంగనూరు ఎలక్ట్రికల్ హబ్‌గా మారనున్నది. స్థానికులు కూడా వెనుకబడిన పుంగనూరుకు పరిశ్రమల రాకతో గుర్తింపు రానున్నదని సంతోషాన్ని వ్యక్తపరుస్తున్నారు. వచ్చే ఐదేళ్ల నాటికి పరిశ్రమలు పూర్తి స్థాయిలో ఏర్పాటై స్థానిక యువకులకు అందుబాటులో రావడంతో పుంగనూరు ప్రాంతం ఎలక్ట్రికల్ హబ్ గా మారుతుంది అనడంలో సందేహం లేదు.

## గడ్డి వామి దగ్ధం

**సోమల, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త** నెల్లిమంద పంచాయతీ చింతలవారిపల్లి గ్రామంలో గడ్డివామి దగ్ధమైంది. శనివారం రాత్రి 10 గంటల ప్రాంతంలో గ్రామానికి మధ్యలో ఉన్న పి బాలసుబ్రమణ్యం గడ్డివామికి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. మంటలు బలంగా ఉండడంతో పుంగనూరు ఫైర్ స్టేషన్ కు బాధితులు ఫిర్యాదు చేశారు. ఫైర్ ఆఫీసర్ సుబ్బరాజు హుటాహుటిన తన సిబ్బందితో కలిసి వచ్చి మంటలను నీటితో అదుపు చేశారు. కాలిపోయిన వరిగడ్డి విలువ 15,000 ఉంటుందని బాధితులు తెలిపినట్టు ఫైర్ ఆఫీసర్ తెలిపారు.

## కందూరులో ఉచిత వైద్య శిబిరం



**సోమల, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త** కందూరు రామాలయం వద్ద జరిగిన ఉచిత వైద్య శిబిరానికి ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించింది. ఆదివారం ఉదయం 10 గంటలకు బెంగళూరు వైదేహి ఆసుపత్రి వారి సౌజన్యంతో వైద్య శిబిరం ప్రారంభమైంది. గుండె, కిడ్నీ, షుగర్, ఎముకలు, చిన్నపిల్లల సంబంధించి వ్యాధులు, చర్మవ్యాధులకు సంబంధించిన వ్యాధులకు వైద్యులు చికిత్సలు నిర్వహించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వైదేహి ఆసుపత్రి సిబ్బంది, డాక్టర్ హరి నారాయణ, బండారు రఘు, కోన శేఖర్, విజయ్, తమ్మి నాయన పల్లి చంద్ర తదితరులు పాల్గొన్నారు.

## నేడు ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం వాయిదా

**కుప్పం, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త** కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (కడ) ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ ప్రతి సోమవారం కుప్పంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమం సోమవారం నాడు అనివార్యకారణాల రద్దు చేసినట్లు కడ కార్యాలయం వారు ప్రకటనలో తెలిపారు. ప్రజలు గమనించాలని కోరారు.

## తలకోన సిద్దేశ్వర స్వామికి పట్టు వస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యేలు

**యర్రావారిపాలెం, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త:**



యర్రావారిపాలెం మండలం నెరబైలు పంచాయతీలో వెలసిన తలకోన సిద్దేశ్వర స్వామికి చంద్రగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే పులివర్తి నాని దంపతులు, పలమనేరు ఎమ్మెల్యే అమరనాథ్ రెడ్డి పట్టువస్త్రాలను సమర్పించారు. తలకోనలో మహాశివరాత్రి ఉత్సవాలు వేడుకగా నిర్వహించనున్నారు. తలకోనకు విచ్చేసిన చంద్రగిరి ఎమ్మెల్యే దంపతులకు, పలమనేరు ఎమ్మెల్యే అమరనాథ రెడ్డికి ఆలయ అధికారులు, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీ సిద్దేశ్వర స్వామికి ఎమ్మెల్యే పులివర్తి నాని దంపతులు పట్టు వస్త్రాలను సమర్పించారు. అలాగే గోపూజ పాల్గొన్నారు. అనంతరం ఆలయ సమీ పంలో ఉన్న పుట్ట వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి, పుట్ట మట్టిని తవ్వి యాగశాలకు తీసుకువచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్యనిర్వహణాధికారి రవీంద్ర రాజు, ఎంపీడీవో అరుణ, మండల అధ్యక్షుడు దేశిరెడ్డి రఘునాథ ,జనరల్ సెక్రటరీ మహేష్ నాయుడు, పార్లమెంటు కార్య దర్శి మధు,యూత్ ప్రెసిడెంట్ నిరంజన్,చిత్తూరు పార్లమెంట్ కన్వీనర్ మల్లూరి దేవి,మండల ఎస్టి సెల్ అధ్యక్షుడు కుంభ నాగరాజ, రైతు కార్యదర్శి ప్రసాద్ నాయుడు, సోషల్ మీడియా కోడినేటర్ చిన్నప రెడ్డి, పాల్గొన్నారు.ఆలయఅధికారులు,మండలనాయకులు, కార్యకర్తలు, అభిమానులు, స్థానికులు పాల్గొన్నారు.

## సిఎం చంద్రబాబును కలసిన వన్నియకులక్షత్రియ నాయకులు

కుప్పంరూరల్, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త



సిఎం చంద్రబాబునాయుడును కుప్పం కు చెందిన తెలుగుదేశ ం పార్టీ వన్ని యకులక్షత్రియ కులం నేతలు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా వారు వివిధ సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లగా సమస్యల పరిష్కారంపై సిఎం చంద్రబాబు సానుకూలంగా స్పందించారు. సిఎంను కలసిన వారిలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర బిసి సెల్ ఉపాధ్యక్షుడు కాణిపాకం వెంకటేష్, కుప్పం బిసి సెల్ నేతలు ఈశ్వర్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆదివారం .. అసలైన మజా దొరికింది !!

కుప్పం, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త

అసలే ఆదివారం.. ఆపై చిరకాల ప్రత్యర్థుల మధ్య హైటెన్షన్ వన్డే మ్యాచ్.. ఇంకేముంది.. ఆదివారం మధ్యాహ్నం నుంచి క్రికెట్ అభిమానులు టివిలకు అతుక్కుపోయారు. ఐసిసి వన్డే ఛాంపియన్స్ ట్రోఫీలో భాగంగా ఆదివారం నాడు చిరకాల ప్రత్యర్థులైన ఇండియా, పాకిస్తాన్ జట్ల మధ్య హైటెన్షన్ మ్యాచ్ దుబాయ్‌లో జరిగింది. ఈ మ్యాచ్‌ను తిలకించేందుకు ఆదివారం నాడు క్రికెట్ అభిమానులు అంతా టివిలకు అతుక్కుపోయారు. కుప్పం పట్టణంలో సైతం మధ్యాహ్నం తర్వాత పెద్దగా జనసంచారం కన్పించలేదు. గ్రామీణ ప్రాంతాల్లో సైతం యువత క్రికెట్ మ్యాచ్ తిలకించేందుకు ఉత్సాహం చూపారు.

## కాలువ గట్ల ఆక్రమణ

- ఇరిగేషన్ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్ళినా కన్పించని ఫలితం
- కాలువ గట్లను విక్రయించి లక్షల రూపాయలు ఆర్జిస్తున్న అక్రమార్కులు

పాలసముద్రం, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త:

పాలసముద్రం మండలంలో అక్రమార్కులు కాదేది అనర్హం అనే చందాన వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే



చెరువుల నుండి ఇటుకల తయారీకి అక్రమంగా మట్టిని తరలించి లక్షల రూపాయల ఆర్జిస్తున్న అక్రమార్కుల దృష్టి ప్రస్తుతం చెరువు కాలువల గట్లపై పడింది. కాలువల కిరువైపుల వున్న గట్టులో వున్న మట్టిని చదును చేసి అక్రమార్కులు ఈ భూములను విక్రయించేస్తున్నారు. మండలంలోని వనదుర్గాపురం పంచాయతీ పరిధిలోని రైతులకు పంటలు సాగు చేసుకోవడానికి రెండు చెరువులు వున్నాయి. ఈ చెరువులకు కాలువల నిర్మాణాల కోసం గతంలో జలవనరులశాఖ పెద్ద ఎత్తున ఖర్చు చేసి రైతుల ద్వారా కాలువలు నిర్మించింది. ఇటు చెరువులకు వర్షపు నీటిని కాలువలు చేరవేస్తుండగా మరోవైపు ఇదే కాలువలు రైతుల పంట పొలాలకు చెరువుల నుండి పంటల సాగుకు నీటిని తీసుకెళ్తున్నాయి. ఈ కాలువలు త్రవ్వే సమయంలో కాలువ మట్టిని కాలువలకు ఇరువైపులు వేయడంతో అవి చిన్న గట్ల తరహాలో ఏర్పాటు అయ్యాయి. కాలువల్లో నీరు ప్రవహిస్తుండటంతో కాలువ గట్ల పరిసరాల్లో వున్న భూములకు విపరీతమైన డిమాండ్ వుంది. ఈ క్రమంలో కొంతమంది కాలువ గట్లను చదును చేసి గుంట భూమిని లక్షల రూపాయ వరకు ఇతరులకు విక్రయాలు చేస్తున్నారు. అలాగే కొంతమంది రైతులు కాలువ గట్లను ధ్వంసం చేసి ఆ భూములను తమ భూముల్లో కలుపుకుంటున్నారు. అలాగే చెరువుల నుండి మట్టిని అక్రమంగా రోజుకు 10 లోడ్ల మేరకు తమిళనాడుకు తరలించి డబ్బులు చేసుకుంటున్నారు. ఇటు చెరువు కాలువల గట్లు ధ్వంసం కావడం, చెరువులోని మట్టిని అక్రమంగా తరలిస్తుండటంతో చెరువుల్లో నీరు చేరక రైతులు పంటలు సాగు చేయడానికి వీలు లేకుండా అల్లాడుతున్నారు. తమ రెండు చెరువుల్లో నెలకొన్న ప్రస్తుత పరిస్థితులను ఇరిగేషన్ అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్ళినా ఇప్పటి వరకు ఎవరు వచ్చి చూసింది లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు.

## గ్రామాలలో విచ్చలవిడిగా బెల్టు షాపులు

**పూతలపట్టు, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త** మండలంలోని ఎం బండపల్లి, వావిల్‌తోట, గొడుగు చింత, పోలవరం, వే నూతనపల్లి, తదితర గ్రామాలలో ఎక్కువగా దుకాణాల షాపులలో మద్యం అమ్మకాలు జరుగుతున్నాయి. గ్రామీణ మహిళలు బహిరంగంగా ఆరోపిస్తున్నారు. గ్రామాలలో బెల్ట్ షాపులు నిర్వహించడం వలన యువత ఎక్కువగా మద్యంకి బానిస అవుతున్నారని ప్రజలు వాపోతున్నారు. గ్రామాలలో నిర్వహిస్తున్న బెల్ట్ షాపులలో ఎమ్మార్పీ ధరలకు ఒక బాటల్ పై 20 రూపాయలు వరకు అధికంగా మందుబాబుల నుండి వసూలు చేస్తున్నట్లు మందుబాబులు ఆరోపిస్తున్నారు. గ్రామలో బెల్ట్ షాపులు నిర్వహించడం వలన ఎన్నో కుటుంబాలు మద్యానికి బానిసై వీధిన పడుతునట్లు బాధ్యత మహిళలు తమ గోడు వెల్లబుచ్చుతున్నారు. మరికొన్ని గ్రామాలలో మద్యం సేవించి మహిళలపై అత్యాచారానికి పాల్పడిన సందర్భాలు కూడా జరిగి ఉన్నాయి. ఇప్పటికైనా ఎక్సైజ్ శాఖ పోలీసులు సరిగ్గా స్పందించకపోవడం లేదు అని తీవ్ర ఆగ్రహం ఒకింత అసహనం వ్యక్తం చేశారు. గ్రామ వార్డు సచివాలయం మహిళ పోలీసులు నిత్యం గ్రామాలలో పర్యటించాలన్నారు.

## బ్యాంక్ ఆఫ్ బరోడా బ్యాంక్ సేవలు వినియోగించుకోవాలి

**పుంగనూరు, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త**



నియోజకవర్గ కేంద్రమైన పుంగనూరులో దాదాపుగా అన్ని బ్యాంకులు తమ సేవలను విస్తరించాలని బ్యాంక్ ఆఫ్ బరోడా సేవలు కూడా ఎంతో అవసరమని విశ్రాంత డిఎస్పి సుకుమార్ బాబు అన్నారు. ఆదివారం బ్యాంకు సేవా కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఖాతాదారులందరూ ఈ సేవా కేంద్రాన్ని ఉపయోగించాలని కోరుతున్నారు. బ్యాంక్ అకౌంట్ల ఓపెనింగ్ గోల్డ్ లోన్ పర్సనల్ లోన్లు బిజినెస్ లోన్లు అయితేనేమి అన్నిటికీ తమ సేవను అందిస్తామని బాడాల సుబ్రహ్మణ్యం తెలిపారు. మాజీ సుబేదార్ నాగరాజా నాయక్, వేణుగోపాలు, ఎక్స్ హవుల్ దారులు రాజారెడ్డి, ఎస్వీ బాబు,హనుమంతప్ప, సుధాకర్ రెడ్డి, హరి మొదలి, నాగరాజరెడ్డి, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

## సిఎం చంద్రబాబును కలసిన రాష్ట్ర నేత గోపీనాథ్



**కుప్పం, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త** రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి, మాజీ సర్పంచ్ గోపీనాథ్ మర్యాదపూర్వకంగా కలిశారు. అమరావతిలోని సచివాలయంలో ముఖ్యమంత్రి ఛాంబరులో ఆయన సిఎంను కలిశారు. ఈసందర్భంగా వివిధ సమస్యలపై సిఎంతో గోపీనాథ్ చర్చించారు. కుప్పంలో పార్టీ పరిస్థితులపై సిఎం చం ద్రబాబు ఆరా తీశారు. కార్యక్రమంలో తెదేపా యువనేత హర్ష ధర్మతేజ్ తదితరులు పాల్గొన్నారు.

## కుప్పంలో సినీనటుడు హైపర్ ఆది సందడి

కుప్పం, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త



ప్రముఖ సినీనటుడు, జబర్దస్త్ హైపర్ ఆది కుప్పంలో సందడి చేశారు. కుప్పం ఇంజనీరింగ్ కాలేజ్ 24వ వార్షికోత్సవం నాగాస్త్ర 2కె25 కార్యక్రమంకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై కళాశాలలో విద్యార్థుల చేత కేకలు పెట్టించారు. ఈ సందర్భంగా హైపర్ ఆది, మరో నటుడు ఆటో రాంప్రసాద్‌లు కాలేజ్ మేగజైన్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా హైపర్ ఆది మాట్లాడుతూ ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉన్న కుప్పం ఇంజనీరింగ్ కాలేజ్‌లో విద్యను అభ్యసించడం విద్యార్థుల అదృష్టమని పేర్కొన్నారు. బిసిఎన్ గ్రూప్స్ ఛైర్మన్ బిసి నాగరాజ్ మాట్లాడుతూ దేశానికి అత్యుత్తమమైన ఇంజనీర్లను అందించాలనే లక్ష్యంతో తమ కళాశాలలో బోధన, పరిశోధనలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సాధించుకుని నాక్ ఎ గ్రేడ్‌తో పాటు అటానమస్ హోదా సాధించడం ఆనందంగా ఉందన్నారు. వైస్ ఛైర్మన్ డా॥ సునీల్ రాజ్ మాట్లాడుతూ తమ విద్యాసంస్థల్లో చదివిన విద్యార్థులకు వందశాతం ఉద్యోగ కల్పనే లక్ష్యంగా తాము పనిచేస్తున్నామన్నారు. వివిధ మల్టీ నేషనల్ సంస్థల్లో, దేశ విదేశాల్లో నేడు తమ విద్యార్థులు ఉద్యోగాలు చేస్తున్నారని ఇది తమకు ఎంతో గర్వకారణమని పేర్కొన్నారు. అనంతరం ప్రిన్సిపాల్ డా॥ సుధాకర్‌బాబు వార్షిక నివేదిక సమర్పించారు. కార్యక్రమంలో ఛైర్‌పర్సన్ శాంత నాగరాజ్, వైస్ ఛైర్మన్ డా॥ సునీల్ రాజ్, సిఇఒ సాగర్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

## మాజీ మంత్రి పెద్దిరెడ్డి..భూమనలను కలసిన వైకాపా నేతలు



**కుప్పం, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త** కుప్పం మున్సిపల్‌కు చెందిన పలువురు నాయకులు ఆదివారం మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఉమ్మడి జిల్లా వైకాపా అధ్యక్షుడు భూమన కరుణాకర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. తిరుపతిలో జరిగిన వైఎస్సార్సీ అనుబంధ విభాగాల అధ్యక్షుల సమావేశంకు వారు హాజరయ్యారు. అనంతరం పెద్దిరెడ్డి , భూమనలను వారు కలిసి మున్సిపల్ సమస్యలు, రాజకీయాల గురించి చర్చించారు. కార్యక్రమంలో మున్సిపల్ రెండో వైస్ ఛైర్మన్ హఫీజ్, కౌన్సిలర్లు మోహన్‌రాం, రాజ్‌కుమార్, నాగరాజు, విజయ్‌కుమార్, అరవింద్ పాల్గొన్నారు.

## రేపు కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు

**శాంతిపురం, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త** రాష్ట్ర ప్రభుత్వం బ్యాంకుల ద్వారా అందించే వివిధ కార్పోరేషన్ల రుణాలకు సంబంధించి ఈనెల 25వతేది మండల కార్యాలయంలో దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ పిఆర్ కుమార్ తెలిపారు. సప్తగిరి గ్రామీణ బ్యాంకు (శాంతిపురం, రాళ్లబూదుగూరు, విజలాపురం), ఎస్‌బిఐ ఆరిముత్తనపల్లి బ్రాంచ్‌ల పరిధిలో దరఖాస్తు చేసుకున్న వారు ఇంటర్వ్యూలకు ఉదయం పది గంటలనుంచి హాజరు కావాలన్నారు.

## శ్రీ లక్ష్మి నరసింహ స్వామి ఆలయ కొడిస్తంభం ప్రతిష్ట



**కల్లూరు, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త** పులిచెర్ల మండలం దేవళంపేట శ్రీ లక్ష్మినరసింహస్వామి ఆల యంలో ఆదివారం కొడిస్తంభం ప్రతిష్ట అత్యంత వైభవముగా నిర్వహించారు. ఆలయంలో ఉదయం స్వామివారికి అభిషేకం నిర్వహించి ప్రత్యేకంగా అలం కరించి అర్చనలు పూజలు జరిపి నైవేద్యం సమర్పించి మహా మంగళహారతి గావించారు. కొడిస్తంభంకు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు అనంత కుమారాచార్యులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు.పెద్దఎత్తునభక్తులుకొడిస్తంభంపూజాకార్యక్రమాల్లో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

## ఆదర్శ పాఠశాల ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

రొంపిచెర్ల, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త:



రొంపిచెర్ల మండలంలోని ఆదర్శ పాఠశాల ప్రవేశాలకు దరఖాస్తులను ఈ నెల 25 వ తేదీ నుండి స్వీకరిస్తున్నట్లు ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సరళ తెలిపారు. 6 వ తరగతి ప్రవేశాలకు ఈ నెల 25వ తేదీ నుండి మార్చి 31వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. బీసీ, ఓసీ లు రూ. 150, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.75 దరఖాస్తు రుసుము చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఆదర్శ పాఠశాలలలోనే ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని అన్నారు. ఐదో తరగతి స్థాయిలో తెలుగు, ఆంగ్ల మాధ్యమాలల్లో పరీక్ష ఉంటుందన్నారు. ఏప్రిల్ 27 న మెరిట్ జాబితా విడుదల చేయడం జరుగుతుందని అన్నారు. విద్యార్థుల ధ్రువ పత్రాల పరిశీలన ఏప్రిల్ 30న ఉంటుందన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## ఉత్తమ సమాజ నిర్మాణంలో సాహిత్యం పాత్ర కీలకం



**చిత్తూరు, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త:** ఉత్తమ సమాజ నిర్మాణంలో సాహిత్యం పాత్ర కీలకమని, సాహిత్యానికి ఎలాంటి ఎల్లలు లేదని ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ రాధేయ పేర్కొన్నారు. చిత్తూరు విజయం డిగ్రీ కళాశాల సమావేశభవనంలో ఆదివారం గంటా కమలమ్మ సాహితీ పురస్కారాలను తుల శ్రీనివాస్, సాంబమూర్తి లండాలకు సంయుక్తంగా నిర్వాహకులు గంటామోహన్ ఆధ్వర్యంలో అందజేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ రాధేయ మాట్లాడుతూ తెలుగు భాషను, సాహిత్యంను పరిరక్షించుకుంటూ భావితరాలకు అందించాల్సిన బాధ్యత సాహితీవేత్తలపై వుందన్నారు. ప్రతిష్టాత్మక గంటా కమలమ్మ స్మారక పురస్కారంను తెలంగాణ రాష్ట్ర కవి తుల శ్రీనివాస్, ఉత్తరాంధ్రకు చెందిన యువకవి సాంబమూర్తి లండాలు అందుకోవడం ప్రశంసనీయమన్నారు. ప్రముఖ వైద్యురాలు, సాహితీవేత్త డాక్టర్ రామలక్ష్మీ మాట్లాడుతూ తల్లిదండ్రుల పేరిట స్మారకార్థం సాహితీ పురస్కారం అందించడం ఆరోగ్యకరమైన సంప్రదాయమన్నారు. ఈ సందర్భంగా తుల శ్రీనివాస్, లండ సాబమూర్తిలకు జ్ఞాపికలు, పది వేల రూపాయల నగదు, శాలువలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో పురస్కార వ్యవస్థాపకులు గంటామోహన్, సాహితీ ప్రముఖులు పలమనేరు బాలాజీ, పళ్ళిపట్టు నాగరాజు, గిరిధరన్, మేఘనాధ్‌రెడ్డి, తులసీనాధంనాయుడు, యువశ్రీ మురళీ, హరినాయుడు, గల్లా మాధవిలత, రాజారత్నంరెడ్డి, కృష్ణంరాజు, శ్రీనివాస్, మూరిశెట్టి గోవిందు, గంటారాజా, పాడి రమేష్‌బాబు, అన్సారీలు, తదితర సాహితీవేత్తలు, సాహితీ అభిమానులు పాల్గొన్నారు.

## నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

**చిత్తూరు, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త:** ప్రజా సమస్యలు పరిశీలించి పరిష్కరించడానికి కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం 9.30 గంటల నుండి కలెక్టరేట్‌లోని నూతన సమావేశభవనంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ సుమిత్‌కుమార్, జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి, డిఆర్ఓ మోహన్‌కుమార్, చిత్తూరు ఆర్డీఓ శ్రీనివాసులు, జిల్లా అధికారులు హాజరు కానున్నారు.

## గాడ్గే బాబా ఆదర్శంతో ముందడుగు

- దక్షిణాది రాష్ట్రాల బిసీ సంక్షేమ సంఘం ఇన్‌ఛార్జీ పి.షణ్ముగం



**చిత్తూరు, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త:** బిసీల ఉన్నతి కోసం కృషి చేసిన గాడ్గే బాబాను ఆదర్శంగా తీసుకుని ప్రతి ఒక్కరు ముందడుగు వేయాలని దక్షిణాది రాష్ట్రాల బిసీ సంక్షేమ సంఘ ఇన్‌ఛార్జీ పి.షణ్ముగం పేర్కొన్నారు. జిల్లా బిసీ సంక్షేమ సంఘ కార్యాలయంలో ఆదివారం గాడ్గేబాబా 150వ జయంతి పురస్కరించుకుని దక్షిణాది రాష్ట్రల బిసీ సంక్షేమ సంఘం ఇన్‌ఛార్జీ పి.షణ్ముగం గాడ్గేబాబా చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పి.షణ్ముగం మాట్లాడుతూ రజక కులంలో పుట్టిన గాడ్గేబాబా నిరక్షరాస్యుడైనప్పటికీ సంఘసంస్కర్తగా, ఆధ్యాత్మిక చైతన్యం, స్వచ్ఛతా ఉద్యమం, కుల నిర్మూలన, విద్యావిధానంపై ప్రజలను చైతన్యవంతులను చేశారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వడ్డెర సంక్షేమ సంఘ అధ్యక్షులు రవిరాజు, జిల్లా నాయి బ్రహ్మణుల సంఘ అధ్యక్షులు సిరియా వెంకటేష్, రిటైర్డ్ ఉద్యోగుల సంఘ నాయకులు సివి ప్రతాప్, వడ్డెర సంఘ నాయకులు హరి, చంద్రయ్య, విశ్వబ్రహ్మణ సంఘ నాయకులు సాయిరాం, అచ్చారి, రజక సంఘ నాయకులు ఈశ్వర్, హరిప్రసాద్, సూరిబాబు, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు పోలీసు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

**చిత్తూరు, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త:** ప్రజా సమస్యలను పరిశీలించి పరిష్కరించడానికి ఎస్పీ మణికంఠ చందోలు సోమవారం ఉదయం 10 గంటల నుండి చిత్తూరులోని జిల్లా పాత పోలీసు కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ప్రజలు హాజరై తమ సమస్యలను ఎస్పీ దృష్టికి తీసుకెళితే వాటిని అక్కడికక్కడే పరిశీలించి పరిష్కరించాలని సంబంధిత పోలీసు అధికారులను ఎస్పీ ఆదేశిస్తారు. చిత్తూరు డిఎస్పీ టి.సాయినాథ్ పాల్గొంటారు.

## ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా వుంచుకోవాలి

**తవణంపల్లె, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త:** ఇంటి పరిసరాలను



పరిశుభ్రంగా వుంచుకోవాలని మండలంలోని మేజర్ గ్రామపంచాయతీ కార్యదర్శి కె.మురుగేశన్ తెలిపారు. పారిశుద్య నిర్వహణలో భాగంగా చెత్త నుండి సంపద తయారీకి వీలుగా పంచాయతీ పరిధిలోని గ్రామాలలో రెండో రోజు ఇంటింట చెత్త సేకరణ కార్యక్రమంను చేపట్టారు. పంచాయతీ కార్యదర్శి కె.మురుగేశన్ ఆధ్వర్యంలో హరిత రాయబారులు పంచాయతీ పరిధిలోని పైమాఘం, నల్లప్పరెడ్డిపల్లె తదితర గ్రామాల్లో ఇంటింటికి తిరిగి తడిచెత్త, పొడి చెత్తను సేకరించి ఎస్‌డబ్యుబిసీ కేంద్రానికి చేర్చారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## ఇంటింటా శుభ్రత ఊరంతా పరిశుభ్రత : కృష్ణవేణి

**చౌడేపల్లి, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త** ఇంటింటా శుభ్రత పాటిస్తే ఊరంతా పరిశుభ్రంగా వుంటుందని ఇఓఆర్డీ కృష్ణవేణి అన్నారు. మండలంలోని దిగువపల్లి పంచాయతీ గ్రామాల్లో ఇంటింటా చెత్త సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అన్ని పంచాయతీల్లోనూ చెత్తను సేకరిస్తున్నట్లు వివరించారు. ఇళ్ళల్లో ఏర్పడే తడి, పొడి చెత్తలను ఎక్కడ పడితే అక్కడ పడేయకుండా పంచాయతీలేర్పాటు చేసే తొట్టెల్లో వేయాలన్నారు. దీనివల్ల పరిసరాలు శుభ్రంగా వుండి అంటు వ్యాధులు ప్రబలకుండా వుంటాయన్నారు. ఆయా పంచాయతీల కార్యదర్శులు, పారిశుధ్య కార్మికులు, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

## వైదేహి ఆరోగ్య శిబిరానికి విశేష స్పందన



చౌడేపల్లి, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త పట్టణంలో నిర్వహించిన వైదేహి ఆరోగ్య వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. శ్రీ వినాయక యువజన కమిటీ ఆధ్వర్యంలో బెంగళూరు వైదేహి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ సహకారంతో నిర్వహించిన శిబిరంలో 250 మందికి పైగా వైద్య సేవలందించినట్లు నిర్వాహకులు తెలిపారు. గుండె సంబంధిత వ్యాధులు, క్యాన్సర్, దీర్ఘకాలిక కీళ్ళు, ఎముకల నొప్పులతో బాధపడుతున్న వారికి పరీక్షలు చేసి మందులు ఉచితంగా అందిం చామన్నారు. వినాయకయువజన కమిటీ సభ్యులు, వైదేహి ఆసుపత్రి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## క్యూలైన్లను పర్యవేక్షించిన ఉపకమీషనర్ ఏకాంబరం

**బోయకొండ(చౌడేపల్లి), ఫిబ్రవరి 23 ప్రభాతవార్త** శక్తిక్షేత్రం బోయకొండకు ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకొన్నారు. ఈనేపధ్యంలో ఇఒ, ఉపకమీషనర్ ఏకాంబరం రద్దీని దృష్టిలో పెట్టుకొని మౌళిక వసతులు సమకూర్చారు. ఆలయంలోని పలు క్యూలైన్లను పర్యవేక్షించారు. భక్తులకు ఎలాంటి ఆటంకం కల్గనీయకుండా గంగమ్మ దర్శనభాగ్యం కల్పించాలని సిబ్బందికి సూచించారు. ఆలయ అధికార, అర్చక, సిబ్బంది సేవలందించారు.

## ఆకట్టుకున్న సినీ గాయకులు:సంబరాల్లో యువకులు

### ఐఐటిలో తిరుత్సవ 2025 ముగింపు





**శ్రీకాళహస్తి,ఫిబ్రవరి 23 ప్రభాతవార్త** శ్రీకాళహస్తి నియోజకవర్గం ఏర్పేడులో కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఐఐటిలో తిరుత్సవ 2025 సంబరాలు ఆదివారం సినీ గాయకుల సుమధుర గానాలతో ముగిసాయి. ఐఐటిని జాతీయ స్థాయిలో గుర్తింపుకు స్థానిక ఐఐటి డైరెక్టర్ ప్రొఫేసర్ కె.యస్.సత్యనారాయణ సారధ్యంలో ఏర్పాటు చేసారు. మూడు రోజుల పాటు యువతను ఉర్రూతలూగించిన తిరుత్సవ 2025 ముగింపు సందర్భంగా డైరెక్టర్ సత్యనారాయణ మాట్లాడుతూ యువతను కకేవలం చదువులకే పరిమితం చేయకుండా సామాజిక కార్యక్రమాల్లోనూ. సాంస్కృత కార్యక్రమాల్లో కకూడా విద్యార్థులను భాగస్వాములు చేస్తూ కార్యక్రమాలను ఏర్పాటు చేసారు.రెండు రోజుల పాటు ఐఐటిలో జాగరణ అన్నట్లు కార్యక్రమాలను నిర్వహించారు. విద్యార్థుల సామాజిక స్పృహతో నాటికలను ఏర్పాటు చేసారు. ఆదివారం సినీ గాయకులు హరిచరణ్, శిరీష,ఆకాష్‌ల సంగీత విభావరి విద్యార్థుల ఆనందోత్సాహాలకు అవధుల్లేకుండా మారింది. కొందరు యువకులు స్టేప్స్ వేస్తే మరి కొందరు నాట్యాలుచేస్తూ ఆనందడోలికల్లో ఓలలాడారు.

***నాటికలతో ఆకర్షణ:*** మూడవ రోజు యువకులు ప్రదర్శించిన నాటికలు ఎంతో సామాజిక స్పృహ కల్గి ఉన్నాయి. ట్రజర్ హంట్ అనే నాటికలో నిధి వేట అనేది ఓ సాహస క్రీడ ఇందులో పాల్గొనేవారు ఆధారాలను పొందుపరచి సమస్యలను పరిష్కరించి దాచిన లక్ష్యాలను కనుగొనటానికి సవాళ్ళను పూర్తి చేయటం ఇతివృత్తంతో ప్రదర్శించారు. క్రికెట్ ఓ మానియా తిరుత్సవ 2025లో ఐపిఎల్ వేలం ఎలా జరుగుతుందని చక్కగా రూపకల్పన చేసారు.టెక్ హిస్ట్ అనే నాటికలో దొంగలరోల్ నెంబర్‌ను కను గోనటానికి చిత్రాల రూపకల్పన,ఆడియోసిగ్నల్ వంటి ఆధారాలపై మీ నైపుణ్యాభివృద్ధి ఉపయో గించటం అనే ఇతివృత్తంతో రూపొందించి చక్కగా ప్రదర్శించారు. తిరుత్సవ ముగింపు సందర్భంగా డైరెక్టర్ ప్రొఫె.సర్ కె.యస్‌సత్యనారాయణముగింపుఉపన్యాసంలో మూడురోజులపాటు సంబరాలను జరుపుకున్నారు.

## ప్రజా ఆరోగ్యమే లక్ష్యంగా స్వచ్ఛాంధ్రా-స్వచ్ఛ దివాస్

తిరుపతిరూరల్, ఫిబ్రవరి23 ప్రభాతవార్త:



తిరుపతిరూరల్ మండలం కూపుచంద్రపేటలో సర్ణాంధ్రా-స్వచ్ఛాంధ్రా కార్యక్రమాన్ని ఆదివారం పినాకి పాని (పిపాసి) ఆధ్వర్యంలో నిర్వహించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోకపోతు కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రత పాటించాలని సూచించారు. (ప్రతి ఇంటికి వెళ్ళి తడి,పొడి చెత్తపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఇవోపిఆర్డి వెంటకరత్నం, పంచాయతీ కార్యదర్శి లక్ష్మీదేవి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## బ్రహ్మోత్సవాలకు భక్తులు, స్థానికులు సహకరించండి

-డిఎస్పీ నరసింహమూర్తి

.తొట్టంబేడు, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరుని మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ఈనెల 21 నుంచి వచ్చే నెల 6వ తేదీ వరకు నిర్వహిస్తారని అందువల్ల ట్రాఫిక్‌కు ప్రతి ఒక్కరు సహకరించాలని డిఎస్పీ నరసింహమూర్తి అన్నారు. అర్బన్ స్టేషన్‌లో ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ శ్రీకాళహస్తీశ్వరాలయానికి వచ్చే భక్తులు తిరుపతి నుంచి వచ్చే బస్సులు అక్కడి నుంచి దేవస్థానం ఏర్పాటు చేయబడిన ఉచిత బస్సుల్లో దేవస్థానం వరకు వెళ్ళవచ్చన్నారు. దేవస్థానంఏర్పాటు చేసిన ఉచిత బస్సుల్లో దేవస్థానం వరకు వెళ్ళవచ్చున్నారు. తిరుపతి నుంచి వచ్చే టూరిస్టు బస్సులను ఏపిసీడ్స్ నందు గల పార్కింగ్ స్థలం నందు మాత్రమే పార్కింగ్ చేయాలని పేర్కొన్నారు. ఇతర ఫోర్ వీలర్ వాహనాలు, ఆటోలు మరియు ద్విచక్రవాహనాలు మార్కెట్‌యార్డు నందు గల పార్కింగ్ స్థలం నందు మాత్రమే పార్కింగ్ చేయాలన్నారు. నాయుడుపేట, చెన్నై, తడ, బిఎన్‌కండ్రిగ మరియు పిచ్చాటూరు నుంచి శ్రీకాళహస్తి వైపు వచ్చే వాహనాలు చెక్‌పోస్టు వద్ద ఉన్న ధర్మరాజుల స్వామి ఆలయం వద్ద పార్కింగ్ స్థలంనందు, మరియు ద స్కూల్ నందు గల పార్కింగ్ స్థలంలో మాత్రమే పార్కింగ్ చేయాలన్నారు. పట్టణంలోని ద్విచక్రవాహనాదారులు శ్రీకాళహస్తి గుడి వద్ద ఉన్న రెండో మరియు మూడో గేటు మధ్యగల పార్కింగ్ స్థలం నందు, మరియు రివర్ వ్యూలాడ్జి పక్కన గల పుష్పాలమఠం వద్ద మాత్రమే పార్కింగ్ చేయాలన్నారు.

## పీసీసీఎఫ్ చిరంజీవి చౌదరి సేవలు ఎనలేనివి

- అమరావతిలో ఈ నెల 28న చౌదరి పదవి విరమణ సన్మాన సభ
- విజయవంతం చేయాలని రెడ్‌సాండర్స్ అసోసియేషన్ నేతలు, సంఘం సభ్యుల పిలుపు

తిరుపతి కలెక్టరేట్, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త ః



అమరావతి అటవీశాఖ కార్యాలయంలో పనిచేస్తున్న పీసీసీఎఫ్ చిరంజీవి చౌదరి రైతులకు చేసిన సేవలు ఎనలేనివని రెడ్ సాండర్స్ అసోసియేషన్ అధ్యక్షులు రవి రాజు, వైస్ ప్రెసిడెంట్ రాము, సెక్రటరీ నాగయ్య, సంయుక్త కార్యదర్శి కొండేటి ఆంజనేయులు, సంఘం సభ్యులు తెలియజేశారు. ఈనెల 28న అమరావతిలో పీసీసీఎఫ్ చిరంజీవి చౌదరి పదవి విరమణ సందర్భాన్ని పురస్కరించుకుని ఆదివారం తిరుపతి రేణిగుంట రెండ్ సాండర్స్ అసోసియేషన్ కార్యాలయంలో అసోసియేషన్ నేతలు, సభ్యులు అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నేతలు రవిరాజు, రాము, నాగయ్య, కొండేటి ఆంజనేయులు మాట్లాడుతూ గతంలో ఎర్రచందనం బొమ్మల తయారీకి అనుమతుల కోసం రైతులు చిరంజీవి చౌదరిని అమరావతిలో కలిసి వినతి పత్రాన్ని అందించడం జరిగిందన్నారు. అనుమతులు మంజూరుపై చౌదరి సానుకూలంగా స్పందించి ఎర్రచందనం బొమ్మల తయారీకి అనుమతులు ఇవ్వడంతో పాటు బొమ్మలు తయారు చేయడం, వాటి విలువ, ఉపయోగాలను గురించి చౌదరి తెలియజేయడంతో నాడు అసోసియేషన్ నేతలు, సభ్యులు, రైతులు ఎంతో సంతోషం వ్యక్తం చేసినట్లు తెలియజేశారు. ఈనెల 28న చౌదరి పదవి విరమణ సందర్భాన్ని పురస్కరించుకుని సన్మాన సభ విజయవంతం చేయాలని అసోసియేషన్ నేతలు, సభ్యులు పిలుపునిచ్చారు.

## 6వేల బాటిల్స్‌నీళ్లు బాటిల్స్ వితరణ

శ్రీకాళహస్తి,ఫిబ్రవరి 23 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయంలో జరుగుతున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి పిలుపు నిచ్చారు. ఈ నేపధ్యంలో ఆదివారం చెన్నైకు చెందినగజలక్ష్మీ బాలయ్య 6వేల నీళ్ళ బాటిల్స్‌ను విరాళంగా అందించారు. వాటిని ఆలయ డెప్యూటీ ఇఒ ఎన్ఆర్ కృష్ణారెడ్డి నాగయ్యలకు అందజేసారు.

## తడిపొడి చెత్తల తొలగింపుపై అవగాహన

శ్రీకాళహస్తి రూరల్, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి మండలంలోని గ్రామ గ్రామాల్లో ప్రజలకు, ప్రజా ప్రతినిధులకు విస్తర్ణాధికారి పద్మజ సారధ్యంలో అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. ఆదివారం ఆమె పలు పంచాయతీల్లో పర్యటించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పారిశుద్యంకు సంబంధించి అవగాహన కల్గి ఉండాలన్నారు. గ్రామాల్లోని వీధులు పరిశుభ్రంగా ఉండాలన్నారు. అంతేకాక బహిర్భూమి బహిరంగంగా ఉండరాదన్నారు. ప్రతి ఇంటిలో మరుగుదొడ్లను నిర్మించుకోవాలన్నారు. అవగాహన సమావేశంలో మండలంలోని అన్ని పంచాయతీలకు సంబంధించిన కార్యదర్శులు హాజరయ్యారు.

## సూర్యప్రభ వాహనంపై పరశురామేశ్వరుడు

శ్రీకాళహస్తిరూరల్, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త



ఏర్పేడు మండలం గుడిమల్లంలో వెలసిన అనంతవల్లీ సమేత పరశురామేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగానిర్వహిస్తున్నారు. చుట్టుపక్కల గ్రామాలకు చెందిన భక్తులు విశేష సంఖ్యలో హాజరై స్వామి అమ్మవార్ల ఉత్సవాలను తిలకిస్తున్నారు. ఆదివారం ఉదయం స్వామి అమ్మవార్ల గ్రామోత్సవం కన్నుల పండువగా సాగింది. స్వామి వారిని సూర్యప్రభవాహనంపై ప్రతి ష్టించి ఊరేగింపు జరిపారు. ఉత్సవంతో పాటు ఆలయ చైర్మెన్ బత్తల గిరి నాయుడు, ఇఓ రామచంద్రారెడ్డిలు పాల్గొన్నారు. అర్చకులు ఎన్ ఎం. వశీకృష్ణశర్మ, పి.వై. పవన్‌కుమార్‌శర్మలు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఉత్సవంతో పాటు ఉభయదారులు తిరుపతికి చెందిన వెంకటకృష్ణ మారుతీ, సివిశాల్‌చక్రవర్తి, హిమబిందు పాల్గొన్నారు.

## శివయ్యకు ఎల్ఇడి టివిలు విరాళం

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరునికి భక్తుల నుంచి విరివిగా విరాళాలు అందుతున్నాయి. ఈ నేపధ్యంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి దాతలు ముందుకు వస్తున్నారు. ఈ నేపధ్యంలో నెల్లూరుజిల్లాకు చెందిన భక్తులు శివయ్య సన్నిధికి రెండు ఎల్ఇటి టివిలు బహూకరించారు. నెల్లూరుజిల్లా పూడిపర్తికి చెందిన సారంగం రామచంద్రయ్య, సారంగం ప్రమీలలు సుమారు రూ. లక్ష విలువ కల్గిన టివిలను ఆలయ ఇఓ టి. బాపిరెడ్డికి బహూకరించారు. ఈ కార్యక్రమాల్లో డెప్యూటీ ఇఓ ఎన్ ఆర్ కృష్ణారెడ్డి, ఎఇఓసతీష్‌మాలిక్, విజయసారధి, నాగభూషణంనాయక్, ప్రదీప్‌సిఐలుతిమ్మయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల ఆరోగ్య సంరక్షణలో ఆస్టర్ నారాయణాద్రి ఆస్పత్రి

– సీఈవో డాక్టర్ శ్రీధర్ ముని, ఎండీ డాక్టర్ సునందకుమార్‌రెడ్డి, ప్రముఖ గుండె వైద్య నిపుణులు డాక్టర్ సుమంత్‌రెడ్డి





***తిరుపతి హెల్త్, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త :*** జర్నలిస్టుల ఆరోగ్య సంరక్షణలో ఆస్టర్ నారాయణాద్రి ఆస్పత్రి ఎప్పుడూ ముందు ఉంటుందని ఆస్పత్రి చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డాక్టర్ శ్రీధర్ ముని, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సునందకుమార్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో తిరుపతి ప్రెస్‌క్లబ్ సంఘం ఆధ్వర్యంలో ఆస్టర్ నారాయణాద్రి ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి జర్నలిస్టు సోదరులు, వారి కుటుంబ సభ్యుల నుంచి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా దాదాపు 224 మంది జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యులకు బీపీ, షుగర్, థైరాయిడ్, కొలస్ట్రాల్, ఈసీజీ, పీఎఫ్టీ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. జర్నలిస్టులు విధి నిర్వహణలో ఒత్తిడిని నిత్యం పని ఒత్తిడి ఎదుర్కోవాల్సి ఉంటుందని, ఈ నేపథ్యంలో ప్రతి జర్నలిస్టు వారి ఆరోగ్య భద్రతపై జాగ్రత్త వహించాలని డాక్టర్లు శ్రీధర్ ముని, సునందకుమార్‌రెడ్డి, ప్రముఖ గుండె వైద్య నిపుణులు డాక్టర్ సుమంత్‌రెడ్డి, పల్మనాలజిస్ట్ డాక్టర్ ప్రీతమ్, గైనకాలజిస్ట్ డాక్టర్ మౌనిక, జనరల్ మెడిసిన్ డాక్టర్ సాయిరాం తేజ, అసిస్టెంట్ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ కార్తీక్ అసిస్టెంట్ కార్డియాలజిస్ట్ డాక్టర్ మధు, ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ యశోద్ సూచించారు. అనంతరం ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ ప్రెస్‌క్లబ్ సంఘం కోరిక మేరకు ఆస్టర్ నారాయణాద్రి ఆస్పత్రి ప్రెస్‌క్లబ్‌లో ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేయడం ఎంతో సంతోషకరమన్నారు. ఈ సందర్భంగా సంఘం నేతలు ఆస్పత్రి డాక్టర్లను శాలువ, పుష్పగుచ్ఛాలతో ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆస్టల్ వాలంటీర్ హెడ్ ఆనంద్, ఆస్టర్ వాలంటీర్ ఎగ్జిక్యూటివ్ మౌళి, పవన్, బ్రాండింగ్ రమేష్, నర్సింగ్ సిబ్బంది, ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు మురళీ, బాలచంద్ర, కమిటి సభ్యులు పరంధామరెడ్డి, జయశంకర్, జాయింట్ సెక్రటరీ విజయ యాదవ్, జర్నలిస్టులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## వేడుకగా అనంతాళ్వారు అవతారమహోత్సవం

తిరుమల, ఫిబ్రవరి 23ప్రభాతవార్తప్రతినిధి:



వైష్ణవ భక్తాగ్రేసురుడు, ఆళ్వారులలో ప్రముఖుడు అనంతాళ్వారు 971వ అవతారోత్సవం తిరుమలలోని అనంతాళ్వారుతోటలో ఆదివారం ఘనంగా జరిగింది. అనంతాళ్వారు వంశీకులు నాలాయిర దివ్యప్రబంధ గోష్టిగానంనిర్వహించారు. పెద్దజీయర్‌స్వామి అనుగ్రహ భాషణం చేశారు.

## నేడు మీకోసం - ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

తిరుపతి కార్పొరేషన్, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త



డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ ఎన్. మౌర్య తెలిపారు. తిరుపతి నగర పాలక సంస్థ కార్యాలయంలో ఈ నెల 10వ తేది సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఉదయం 10.30 గంటల నుండి నిర్వహించనున్నట్లు, 9.30 గంటల నుండి 10.30 గంటల వరకు డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కమిషనర్ ఎన్. మౌర్య తెలిపారు. ప్రజలు తమ స్థానిక సమస్యలపై అర్జీలు అందించవచ్చని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్. మౌర్య ఆదివారం తెలిపారు. అర్జీదారులు వినతిపత్రంతో పాటు ఆధార్ కార్డు జతపరిచి, పనిచేయు ఫోన్ నంబర్లను పొందుపర్చాలని కమిషనర్ తెలిపారు.

## నిత్యాన్నదానాన్ని పరిశీలించిన బృందమ్మ

**శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త** మహాశివరాత్రి సందర్భంగా నిత్యం వేలాదిమందికి ఆకలితీర్చే నిత్యాన్నదాన పథకంలో భోజనాలను ఆదివారం రాత్రి బొజ్జలబృందమ్మ పరిశీలించారు. తయారు చేయబడిన భోజనాలకు సంబందించి ఇన్‌ఛార్జి నాగభూషణం నాయక్, సారధిలను అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజు సుమారు పదివేలమందికి భోజనాలు అందించడం జరుగుతుంది కాబట్టి జాగ్రత్తగా నాణ్యతగల భోజనాలను అందించాలని ఆమె సూచించారు. భక్తులతో కలసి భోజనాలను భోంచేశారు. ఆమెతో పాటు మహిళా నాయకులు పాల్గొన్నారు.

## టెన్నీస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్లో విద్యార్థినుల ప్రతిభ

తిరుపతి విద్య, ఫిబ్రవరి 23 ప్రభాత వార్త



ఆంధ్రప్రదేశ్ టెన్నిస్ బాల్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 21వతేదీ నుంచి ఆదివారం వరకు మూడు రోజుల పాటు జరిగిన 12వ సీనియర్ స్టేట్ లెవల్ టెన్నిస్ బాల్ క్రికెట్ ఛాంపియన్షిప్ ఉమెన్స్ విభాగంలో తిరుపతి జిల్లా బాలికల జట్టు 3వ స్థానంలో నిలిచింది. ఇందులో పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం విద్యార్థులు పాల్గొని ప్రతిభచాటారు. ఈ సందర్భంగా వీసీ ఉమ, రిజిస్ట్రార్ రజిని, అధ్యాపకులు విద్యార్థులను అభినందించారు.

## చిగురువాడలో 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రా'

**తిరుపతిరూరల్, ఫిబ్రవరి23 ప్రభాతవార్త:**



తిరుపతిరూరల్ మండలం చిగురువాడ గ్రామ పంచాయతీలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని సర్పంచ్ ముచ్చేలి ప్రదీప్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. సర్ణాంధ్రా-స్వచ్ఛాంధ్రాపై పంచాయతీ కార్యధర్శి ముత్యాల లక్ష్మీదేవి పారిశుధ్య కార్మికులతో కలిసి ఇంటింటికి వెళ్ళి అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. తడి, పొడి చెత్తలను వేర్వేరు బుట్టలలో వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.



తిరుపతి ప్రెస్‌క్లబ్ డైరీ-2025ను ఆవిష్కరిస్తున్న ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు, ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు, కమిటీ సభ్యులు, జర్నలిస్టు సోదరులు
**తిరుపతి కలెక్టరేట్, ప్రభాతవార్త**

## ఎర్రమనాయుడు లేని లోటు పూడ్చలేనిది

పుత్తూరు, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త :



తెలుగుదేశం పార్టీలో ఎర్రమ నాయుడు లేని లోటు పూడ్చ లేనిదని టిడిపి రాష్ట్ర కార్యనిర్వా హక కార్యదర్శి పోతుగుంట విజ య్‌బాబు అన్నారు. ఆదివారం పట్టణంలోని ఎంబి రోడ్డులోని తన కార్యాలయంలో ఎర్రమ నాయుడు 68వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టిడిపి తరపున కేంద్ర మంత్రిగా, పార్లమెంట్‌లో ప్రతిపక్ష నాయకుడిగా ఆయన రాష్ట్రానికి ఎనలేని సేవలు అందించారని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి జి.ధనపాల్, పరమేశ్వరమంగళం పిఎసిఎస్ మాజీ ఛైర్మన్ శేఖర్‌నాయుడు, ఇంకా నాయకులు దాసరి విజయ్‌చౌదరి, కుమార్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ భాస్కర్, మణికంఠ, కోటయ్య, మేఘనాత్, పరంధామయ్య, గాలి సుబ్రమణ్యంనాయుడు, దాసరి అజయ్ చౌదరి, పోతుగుంట రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## నారాయణ డాక్టర్ మేకింగ్ ప్రోగ్రాం విజయవంతం

తిరుపతి విద్య, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త



నారాయణ విద్యాసంస్థల ఆధ్వర్యంలో రామ చంద్రాపురం నారాయణ పాఠశాల ప్రాంగణంలో నిర్వహించిన డాక్టర్ మేకింగ్ ప్రోగ్రాంకు కార్యక్రమానికి ఉమ్మడి చిత్తూరు జిల్లా నుండి దాదాపు 2000 మంది విద్యార్థులు వారి తల్లిదండ్రులు హాజరయ్యారు. ముఖ్య అతిథిగా హాజరైన ప్రముఖ శస్త్ర చికిత్స నిపుణులు డాక్టర్ బలరామరాజు మాట్లాడుతూ జనాభాకు అవసరమైన వైద్యుల సంఖ్య తక్కువగా ఉందని, నారాయణ విద్యాసంస్థలు పాఠశాల స్థాయి నుంచే రూపకల్పన చేసిన నీట్ కోచింగ్ ప్రోగ్రాం చాలా ఉపయోగకరంగా ఉంటుందని, ఎక్కువ మంది విద్యార్థులు ఈ ప్రోగ్రాంను ఉపయోగించుకుని మంచి వైద్యులుగా రాణించాలని ఆకాంక్షించారు. సంస్థ డి.జి.యం. కొండలరావు మాట్లాడుతూ పాఠశాల స్థాయిలోనే నీట్ శిక్షణ ఇవ్వడం వల్ల తన విద్యార్థులు ఒత్తిడికి లోను కాకుండా నీట్ లో అత్యుత్తమ ర్యాంకులు సాధిస్తున్నారని 2024 లో తమ విద్యార్థి సాయి చైతన్ రెడ్డి 720 కి 705 మార్కులు సాధించాడని తెలిపారు. జీర్ణ కోశ వ్యాధి నిపుణులు డాక్టర్ల సతీష్ చంద్రారెడ్డి నీట్ పరీక్ష అత్యధిక పోటీ గల పరీక్షని, దానికి నారాయణ విద్యాసంస్థలు అందించే శిక్షణ వల్ల సులువుగా సీట్లు సాధించడం వీలవుతుందని తెలిపారు. కార్యక్రమంలో డీన్ లు ఏ.జీ.యం లు, ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఆరోగ్య సంరక్షణలో క్రీడలు ప్రధాన పాత్ర

తిరుపతి విద్య, ఫిబ్రవరి 23 ప్రభాత వార్త



క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు శరీర, మానసిక ఉల్లాసానికి, ఆరోగ్య సంరక్షణకు ఎంతో దోహదపడతాయని పద్మావతి మహిళా వర్సిటీ వీసీ ప్రొఫెసర్ వి ఉమ అభిప్రాయపడ్డారు. ఆదివారం ఎస్వీ అగ్రికల్చరల్ కళాశాల వేదికగా ఎన్జీరంగా వర్సిటీ బోధన, బోధనేతర సిబ్బందికి మూడు రోజుల పాటు జరగనున్న క్రీడా, సాంస్కృతిక పోటీలకు ఆమె ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్సిటీ బోధన, బోధనేతర సిబ్బందికి క్రీడల పోటీలు నిర్వహించడం శుభపరిణామన్నారు. ఉద్యోగులు ఒత్తిడిని జయించి, మానసిక ఉల్లాసాన్ని పొందటానికి క్రీడలు, సాహిత్య, సాంస్క ృతిక కార్యక్రమాలు వ్యాయామం లాంటివన్నారు. ప్రతి ఉద్యోగి ఏదో ఒక విభాగంలో క్రీడలు ఆడటం దినచర్యలో భాగం చేసుకోవాలన్నారు. వర్సిటీ డీన్ డాక్టర్ కరుణసాగర్ మాట్లాడుతూ శారీరదృఢత్వానికి, సంపూర్ణ ఆరోగ్యానికి క్రీడలు ప్రతి ఉద్యోగికి అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో ఇంటర్నేషనల్ ప్రోగ్రాం డైరెక్టర్ మునిరత్నం, ఏడీఆర్ డాక్టర్ వి సుమతి, కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎంవీ రమణ, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ రవికాంత్ రెడ్డి, వర్సిటీ పరిధిలోని ఐదుజోన్ల నుంచి దాదాపు 200 అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

## అంకమ్మ, పుల్లమ్మ అమ్మవార్లకు ప్రత్యేక పూజలు

రామచంద్రాపురం, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త:



బ్రాహ్మణ కాల్వ గ్రామ సమీపంలో వెలసియున్న అంకమ్మ, పుల్లమ్మ అమ్మవార్లకు ఆదివారం రిటైర్డ్ ఎంఈఓ వీరరాఘవులు నాయుడు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవార్లకు వివిధ రకాల సుగంధభరిత పరిమళ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించారు. నూతన వస్త్రాలు ధరించి, వివిధ రకాల పుష్పాలతో సుందరంగా అలంకరించారు. అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు.

## స్టేట్ లెవల్ అబకస్ పోటీలో సొక్రటీస్ స్కూల్ విద్యార్థి ప్రతిభ.

తిరుపతి విద్య, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త



రొటరి క్లబ్, శ్రీ కాళహస్తి వేదికగా జరిగిన అబాకస్ స్టేట లెవల్ కాంపిటీషన్ లో సొక్రటీస్ స్కూల్ విద్యార్థి , రెండోవ తరగతి చదువుతున్న ఎం. రోహిత్ (స్టార్ జూనియర్ లెవెల్2) కేటగిరి లో రెండవ ప్రైజ్ సాదించారు. ఈ సందర్భంగా విద్యార్థిని నీ పాఠశాల కరస్పాండెంట్ ప్రదీప్ రెడ్డి, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

## ప్రకృతి వ్యవసాయం , పోషకాల మణిహారం. -డి.పి.ఏం షణ్ముగం

తిరుపతి విద్య, ఫిబ్రవరి 23 ప్రభాత వార్త



శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం మహిళా అధ్యయన విభాగం, రాష్ట్రీయ ఉచ్ఛతర్ శిక్షా అభియాన్ (రూస )మంజూరు చేసిన ప్రాజెక్టులో భాగంగా సేంద్రియ, ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై చంద్రగిరి మండలం, కందులవారి పల్లి లో మహిళా రైతులకు మూడు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమం లో ప్రాజెక్ట్ ప్రిన్సిపాల్ ఇన్వెస్టిగేటర్ డాక్టర్ నీరజ మాట్లాడుతూ ఈ శిక్షణ ద్వారా మహిళలకు ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై శిక్షణ అందజేసి తద్వారా వారిని సామాజిక వ్యాపారవేత్తలు గా తయారు చేయడమే ఈ శిక్షణా కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ఏపీ సిఎన్ ఎఫ్ తిరుపతి జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ షన్ముగం మాట్లాడుతూ ప్రతి ఇంటిలో చెత్తను ఎరువుగా ఉపయోగించి, ప్రకృతి వ్యవసాయ విధానంలో తప్పనిసరిగా కిచెన్ గార్డెన్ లేదా టెర్రస్ గార్డెన్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యమంలో కందులవారి పల్లి, నారావారి పల్లి, శేషాపురం గ్రామాలనుండి మహిళా రైతులు పాల్గొన్నారు.

## నేటి నుంచి రూ.200 టిక్కెట్లు జారి

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయంలో జరిగే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో శివరాత్రి పర్వదినాన దర్శనాలకు స్థానికులకుఅందించే తక్కువ ధరల ప్రవేశ టిక్కెట్లును సోమవారం ఉదయం 6 గంటల నుంచి జారి చేయబడుతుందని ఇఓ టి. బాపిరెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. అందరికి అందుబాటులో ఉండేటట్లు మూడు కౌంటర్లను ఏర్పాటు చేసినట్లు ఆయన వివరించారు. టిక్కెట్లు కొనుగోలుకు వచ్చే వారు ఆధార్‌కార్డులతో రావాలన్నారు. టిక్కెట్ కౌంటర్స్‌ను జయరామారావువీదిలోని దేవస్థానంకు సంబంధించిన భక్తకన్నప్ప సదన్ అతిధి గృహం వద్ద, నెహ్రూవీధిలోని దేవస్థానంకు సంబంధించిన ప్రసన్న వరదరాజస్వామి ఆలయం వద్ద నాలగవ గేట్ సమీపంలోని సిఆర్ఓ కార్యాలయంలో ఏర్పాటు చేసినట్లు వివరించారు. టిక్కెట్లు కోసం వచ్చిన వారు ఒక ఆధార్‌కార్డు జిరాక్స్ కాపీని సమర్పించాలని ఇఓ పాపిరెడ్డి పేర్కొన్నారు. 24 సోమవారం ఉదయం 6గంటలనుంచి 25 సాయంత్రం 5గంటల వరకు జారి చేయబడుతుందని ఇఓ తెలిపారు.

## శివయ్య సేవలో ఎంపి హైకోర్టు జడ్జి

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త



దక్షిణ కైలాసంగా ప్రఖ్యాతి గాంచిన శ్రీకాళహస్తీశ్వ రాలయానికి అతిధుల రాక అధికంగా ఉంది. ఉదయం నుంచి ఆలయంలో ఇసుకేస్తే రాలనంత రద్దీ చోటు చేసుకుంది. ఈ నేపధ్యంలో ఆదివారం మధ్య ప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు జడ్జి దుప్పాల వెంకటరమణ కుటుంబసభ్యులతో రాగా ప్రోటోకాల్‌మేరకు ఎఇఓ విద్యాసాగర్‌రెడ్డి దక్షిణ గోపురం వద్ద వేదపండితులతో ఆహ్వానం పలికారు. స్వామి అమ్మవార్లను దర్శించుకున్న వారికి మృత్యుంజయస్వామి ఆలయం వద్ద వేదపండితులతో ప్రత్యేకాహ్వానం పలికి తీర్థ ప్రసాదాలను అందించారు.

# తిరుపతి డివిజన్

## పరిశుభ్రతతోనే ప్రజా ఆరోగ్యం

-శ్రీనివాసపురంలో స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివాస్ కార్యక్రమం

**తిరుపతిరూరల్, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త:**



ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలని.... పరిశుభ్రతతోనే ప్రజా ఆరోగ్యం అని శ్రీనివాసపురం గ్రామ పంచాయతీ కార్యధర్శి మాధవి అన్నారు. ఆదివారం తిరుపతిరూరల్ మండలం శ్రీనివాసపురంలో 'స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివాస్' కార్యక్రమాన్ని నిర్వహించారు. పంచాయతీలోని ప్రతి ఇంటికి వెళ్ళి తడి, పొడి చెత్తల నిర్వాహణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసపురం గ్రామ సర్పంచ్ ఈగ పద్మావతి, ఉప సర్పంచ్ సునీల్ చౌదరి, వార్డు సభ్యులు, బిల్ కలెక్టర్ తదితరులు పాల్గొన్నారు.

## వ్యక్తి ఆత్మహత్య

రేణిగుంట ఫిబ్రవరి 23 ప్రభాతవార్త



రేణిగుంట మండలం కరకంబాడి పంచాయతీ తారక రామా నగర్ లో ఇబ్రహీం అనే వ్యక్తి ఆదివారం ఆత్మహత్య చేసుకున్నాడు. స్టేషన్ రైటర్ గౌరీ నాయుడు ఇచ్చిన సమాచారం మేరకు తారక రామా నగర్‌కు చెందిన ఇబ్రహీం గత కొద్ది సంవత్సరాలుగా కుటుంబ సభ్యులతో విడిపోయి ఒంటరిగా జీవిస్తున్నాడు. అతను మద్యం, గంజాయికి బానిస అయ్యాడు. కుటుంబం దూరం కావడంతో మనస్థాపానికి గురై చీరతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న రేణిగుంట అర్బన్ ఎస్సై అరుణ్ కుమార్ రెడ్డి తమ సిబ్బందితో డీఎస్పీ శ్రీనివాస్, సీఐ శరత్ చంద్ర ఆదేశాల మేరకు సంఘటనా స్థలం చేరుకొని భార్య మస్తానీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## ఉచిత అంబులెన్స్ సేవలు ప్రారంభిస్తాం..

డాక్టర్ తిరుపతి పాణిగ్రాహి.

రేణిగుంట ఫిబ్రవరి 23 ప్రభాతవార్త



శ్రీ బాలాజీ మెడికల్ కళాశాల ఆసుపత్రి తరపున అతి త్వరలో ఉచిత అంబులెన్స్ సేవలను అందిస్తామని శ్రీ బాలాజీ మెడికల్ కళాశాల ఆసుపత్రి చైర్మన్ డాక్టర్ తిరుపతి పాణిగ్రాహి తెలిపారు. ఆదివారం డాక్టర్ పాణిగ్రాహి ఆసుపత్రిని సందర్శించారు. రోగుల ద్వారా సదుపాయాలపై ఆరా తీశారు. ఎన్టీఆర్ వైద్య ఆరోగ్య సేవలు స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. శ్రీబాలాజీ ఆసుపత్రిని పేద మధ్యతరగతి ప్రజలకు అందుబాటు ధరలలో వైద్య సేవలు అందించాలన్న ఉద్దేశంతో ప్రారంభించామన్నారు. రోజుకు 300 మందికి ఉచిత ఓపి సేవలు అందిస్తున్నామన్నారు. అవసరమైన వారికి ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా ఉచితంగా వైద్యం చేస్తున్నట్లు తెలిపారు. ఆసుపత్రి పరిధిలోని 30 కిలోమీటర్ల వరకు అత్యవసర వైద్య సేవలు అందించడానికి త్వరలో ప్రణాళికలు రూపొందించి ఉచిత అంబులెన్స్ సేవలను అందిస్తామన్నారు. ఆసుపత్రికి అనుసంధానమైన మెడికల్ షాపులో లాభాపేక్ష లేకుండా మందుల్లో మెడికల్ కిట్ల నందు దాదాపు 40 శాతం ఎమ్మార్పీ రేట్లపై రాయితీలు కల్పించేలా చర్యలు చేపడతామన్నారు. మరికొద్ది రోజుల్లో ఎంఆర్ఐ స్కానింగ్ అందుబాటులోకి తెస్తామన్నారు. చైర్మన్ తో పాటు ఆసుపత్రి జేఈవో నవీన్ కుమార్ రెడ్డి, ఆసుపత్రి చీఫ్ ఫిజీషియన్ డాక్టర్ సందీప్ రెడ్డి, ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ రాహుల్ పాల్గొన్నారు.

## క్రీడలకు ప్రభుత్వ ప్రోత్సహం ..యువత అందిపుచ్చుకోవాలి..!

టిడిపి నాయకుడు డాలర్స్ దివాకర్ రెడ్డి , రాష్ట్ర స్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ విజేతలు ప్రకాశం, కడప



***చంద్రగిరి, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త:*** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రభుత్వ పరంగా క్రీడలకు అందిస్తున్న ప్రోత్సాహాన్ని యువత అందిపుచ్చుకుని అత్యుత్తమ క్రీడాకారులుగా రాణించాలని టిడిపి నాయకుడు, డాలర్స్ గ్రూప్ అధినేత శమరపాకు దివాకర్ రెడ్డి అన్నారు. స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో 12వ రాష్ట్ర స్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ పురుషులు, మహిళలు టోర్నమెంట్ ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిధిగా విచ్చేశారు. ఆయన మాట్లాడుతూ క్రీడలలో గెలుపు ఓటములు సహజం, అయితే ఓటమితో కృంగిపోకుండా క్రీడా స్ఫూర్తిని పెంపొందించుకుని ముందడుగులు వేయాలన్నారు. అదేవిధంగా విశిష్ట అతిధి ఎస్వీ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్ డాక్టర్ పి. ప్రశాంత్ టెన్నిస్ బాల్ క్రికెట్ ద్వారా జాతీయ స్థాయి టీమ్‌లో స్థానం సాధించే దిశగా సాధన చేయాలన్నారు. ఈ పోటీలకు 16 జట్లు పురుషులు, 8 జట్లు మహిళలు హాజరు కాగా పురుషుల విభాగంలో ప్రకాశం జిల్లా, మహిళల విభాగంలో కడప జిల్లా జట్లు విజేతలుగా నిలిచారు. విజేతలకు డాలర్స్ దివాకర్ రెడ్డి, డాక్టర్ ప్రశాంత్ చేతులమీదుగా ట్రోఫీలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ టెన్నిస్ బాల్ క్రికెట్ అసోసియేషన్ ఛైర్మన్ పడిగల సురేష్‌బాబు, జనరల్ సెక్రటరీ రంభ ప్రసాద్, స్టేట్ ఆర్గనైజేషన్ సెక్రటరీ రవి, టిడిపి నాయకురాలు లంకెళ్ళ లలిత, తదితరులు పాల్గొన్నారు.

## పొద్దు తిరుగుడు పంట సాగుపై అవగాహన

కేవీబీ పురం, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త:

జాతీయ ఆహార భద్రతా మిషన్ సహకారంతో రాస్ కేవీకే కరకంబాడి వారు కేవీబీ పురం మండలం బ్రాహ్మణపల్లి గ్రామంలోని నూనె గింజల్లో సామూహిక ప్రథమ శ్రేణి ప్రదర్శన క్షేత్రాలను సందర్శించారు. పొద్దు తిరుగుడు వంగడం ఎన్‌డీఎస్‌హెచ్ 1012 విత్తనాన్ని ఉచితంగా పంపిణీ చేశారు. పొద్దు తిరుగుడు పంట సాగు, విత్తుట, కలుపు నివారణ, ఎరువుల వినియోగం, పురుగు నివారణ గురించి రైతులకు శాస్త్రవేత్తలు దివ్య వివరించారు.

## మహా శివరాత్రికి ముస్తాబైన శ్రీ అగస్తీశ్వర స్వామి ఆలయం

పుత్తూరురూరల్, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త:



పుత్తూరు మండల పరిధిలోని తిరుమలకుప్పం గ్రామంలో వెలసిన శ్రీ అన్నపూర్ణాంబికాదేవి సమేత శ్రీ అగస్తీశ్వర స్వామి ఆలయం ఈ నెల 26వ తేదీ మహా శివరాత్రి సందర్భంగా ఆలయాన్ని ముస్తాబు చేస్తున్నారు. అలాగే ఆలయానికి రోడ్డు సౌకర్యం రోడ్డుకిరువైపులా విద్యుత్ దీపాలు ఏర్పాటు చేస్తున్నారు. ఆలయాన్ని గత కొన్ని నెలలుగా మరమ్మతులు చేపడుతున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తాగునీటి వసతి కూడా ఏర్పాటు చేశారు. గ్రామస్తులు, దాతలు ఆలయాన్ని అభివృద్ధి చేయడానికి దాతలు సాయంతో పనులు చేపడుతున్నారు.

## పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం

విజయపురం, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త:

గ్రామాల్లో శుభ్రతతోనే ప్రజలు ఆరోగ్యవంతమైన జీవనం సాగిస్తారని పంచాయతీ కార్యదర్శి సంపూర్ణ పేర్కొన్నారు. గత రెండు రోజులుగా గ్రామ పంచాయతీ పరిధిలో స్పెషల్ డ్రైవ్ కింద చెత్తాచదారాన్ని తొలగించి ట్రాక్టర్ ద్వారా ఎస్‌డబ్ల్యు పీసీ కేంద్రానికి తరలించారు. పంచాయతీ కార్యదర్శి మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రభుత్వ నిధులు వెచ్చించి గ్రామాల్లో పరిశుభ్రతను పాటించి దోమల నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్‌తో పాటు గ్రామస్తులు ఉన్నారు.

## మాజీ మంత్రి రోజాను కలసిన మండల వైసీపీ నాయకులు

విజయపురం, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త:



వైసీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన విజయపురం మండలానికి చెందిన గుణశేఖర్‌రెడ్డి ఆదివారం మండల పార్టీ నాయకులతో కలసి నగరిలో మాజీ మంత్రి రోజా నివాసంలో కలసి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో విజయపురం వైసీపీ కన్వీనర్ శివరాజు, వైస్ ఎంపీపీ మంజు, బాలాజీ, జిల్లు దాసు తదితరులు ఉన్నారు.

## మామిడి అధిక దిగుబడికి సమర్ధవంతమైన పోషకాహార నిర్వహణ

చంద్రగిరి, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త:

సమర్ధవంతమైన పోషకాహార నిర్వహణతో మామిడి పాగులో అధిగక దిగుబడి సాధించవచ్చని మండల ఉద్యానవన అధికారి శైలజ అన్నారు. మండల పరిధిలోని నారావారిపల్లిలో ఆదివారం కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ ఆధ్వర్యంలో రైతులకు మామిడి అధిగ దిగుబడిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ వ్యవసాయ శాస్త్రవేత్త నర్శిరెడ్డి అధిగ దిగుబడి కొరకు నానో డిఏపి ఉపయోగించడంపై వివరించారు. తిరుపతి హెచ్ఓ మురళి సిఐఎల్ ఉత్పత్తులు, ఎరువులు మామిడి తోటలకు పూర్తి పోషకాలను అందించి అధిక దిగుబడికి దోహదపడగలవన్నారు. ఈ కార్యక్రమంలో కోరమాండల్ మేనేజర్ రమణారెడ్డి, వ్యవసాయ శాస్త్రవేత్త అనిల్ కుమార్ రెడ్డి, చంద్రగిరి, నారావారిపల్లి, భీమవరం రైతులు పాల్గొన్నారు.

## అక్రమంగా మట్టిని తరలిస్తే చర్యలు తప్పవు..ఎస్ఐ

తొట్టంబేడు, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త

మండలంలో ఏ ప్రాంతం నుంచైనా మట్టితరలింపును చేపడితే చర్యలు తప్పవని తొట్టంబేడు ఎస్ఐ ఈశ్వరయ్య తెలిపారు. మండలంలోని పొయ్య పంచాయతీ పరిధిలోని రామా నాయుడు గిరిజన కాలనీ సమీపంలో కుక్కరాయగుంట నుంచి ఆదివారం గ్రావెల్‌ను అక్రమంగా తరలి స్తుండగా స్థానికులు సమాచారం మేరకు తొట్టంబేడు ఎస్ఐ ఈశ్వరయ్య అక్కడికి చేరుకుని అక్రమవాణాను అడ్డుకున్నారు.

## కన్నులపండువగా అశ్వర్థ నారాయణ కల్యాణోత్సవం

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త



సూళ్లూరుపేటలోని శ్రీబాలాంజనేయస్వామి దేవస్థానంలో వేపచెట్టు, రావిచెట్టుకు ప్రత్యేక పూజలు చేసి అనంతరం అశ్వర్ధ నారాయణ కల్యాణాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. ఆదివారం ఉదయం దేవస్థానం ప్రాంగణంలో వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య ప్రారంభమైన కల్యాణ మహోత్సవం మధ్యాహ్నం వరకు కొనసాగింది. భక్తులు పెద్దసంఖ్యలో హాజరై కల్యాణం తిలకించారు. దేవస్థానం ప్రధాన అర్చకులు దివి లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో కల్యాణ మహోత్సవం జరిగింది. ట్రస్టుబోర్డు మాజీ ఛైర్మన్ అయితా శ్రీధర్ పర్యవేక్షణలో కార్యక్రమం జరిగింది.

## 3,332 మందికి పిఎం కిసాన్ సాయం

కోట, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త

రైతులకు పెట్టుబడి ఆర్థిక సహాయంతో పాటు జీవనోపాధి మెరుగుపరచడమే లక్ష్యంగా పిఎం కిసాన్ నిధి సహాయాన్ని ఈ నెల 24న కేంద్రప్రభుత్వం విడుదల చేస్తున్నట్లు కోట మండల వ్యవసాయాధికారి నిరంజన్‌కుమార్ తెలిపారు. ఆదివారం ఆయన వ్యవసాయశాఖ కార్యాలయంలో ప్రభాతవార్తతో మాట్లాడుతూ అర్హత కలిగిన రైతులు కోట మండలంలో 3,332 మంది ఉన్నారని తెలిపారు. వీరికి ఏడాదికి రూ.6 వేలు చొప్పున ప్రభుత్వం సహాయం అందిస్తుందన్నారు. ఈ నిధులను రెండు వేల రూపాయలు చొప్పున మూడు విడతల్లో రైతుల ఖాతాల్లో జమ చేస్తారని చెప్పారు. నేరుగా రైతుల ఖాతాలకు కేంద్రప్రభుత్వం నిధులు జమ చేస్తుందని తెలిపారు.

## ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయండి

### - 10వ తరగతి విద్యార్థులకు అవగాహన సదస్సు



కోట, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త

ఆత్మవిశ్వాసంతో 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు రాయాలని ఎన్‌బికెఆర్ ఐఎస్‌టి డైరెక్టర్ డాక్టర్ వి.విజయ కుమార్‌రెడ్డి కోరారు. ఆదివారం కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఐఎస్‌టిలో సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ప్రేరణ తరగతులు నిర్వహించారు. ముఖ్య అతిథిగా కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి పాఠ్యాంశంలోని ముఖ్యమైన అంశాలపై పట్టు సాధిస్తే మంచి మార్కులు పొందడానికి అవకాశం ఉంటుందన్నారు. అనంతరం ఎఎస్‌డబ్ల్యు మనోజ్, సుధామణి మాట్లాడుతూ పద్యభాగంలో కవి పరిచయం, గద్య భాగంలో ప్రక్రియలు, లేఖ, కరపత్రం అంశాలు, ఛందస్సులో వృత పద్యాలపై పరీక్షల్లో తప్పకుండా ప్రశ్నలు వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో వసతి గృహాల అధికారులు పద్మజ, రవి, పి.ఉషారాణి, మణికన్నన్, మహేంద్ర, సూళ్లూరుపేట ఎఎస్‌డబ్ల్యు పరిధిలో ఉమా, సరిత, సంతోష్‌కుమార్, శేషమ్మ, నరసింహారావు తదితరులు హాజరయ్యారు.

## స్వర్ణముఖినదిలో యువకుడు మృతి

నాయుడుపేట, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త

నాయుడుపేట మండలంలోని కూచివాడపాళెంకు చెందిన చిప్పల వినీల్(19)అనే యువకుడు స్వర్ణముఖి నదిలో ఆతకు వెళ్ళి మృతిచెందిన సంఘటన ఆదివారం జరిగింది.సేకరించిన సమాచ్చారం మెరకు వివరాలిలా ఉన్నాయి.కూచివాడపాళెం కు చెందిన వినీల్ తనస్నేహితులతో కలిసి సరదాగ స్వర్ణముఖి నదిలోకి ఈతకు వెళ్ళారు.స్వర్ణముఖినదిలో ఈతాడుతుండగా వినీల్ లోతైన గుంటలో పడి పోయాడు.స్నేహితులు గుర్తించి ఆయువకుడిని కాపాడి బయటకుతీసి గుణపాటిపాళెం ప్రభుత్వ ఆసుపత్రికి తరళించారు.అప్పటికే వినీల్ మృతిచెందినట్లు వైధ్యులు తెలియజేశారు.వినీల్ మృతితో ఆగ్రామంలో విషాధచ్చాయలు అలుముకున్నాయి.

## మామిడికాలువలో గుర్తుతెలియని మృతదేహం

నాయుడుపేట, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త

నాయుడుపేట మండలంలోని మేనకూరు సమీపంలో ఉన్న మామిడికాలువలో గుర్తుతెలియని మృతదేహం పడిఉండటాన్ని విఆర్ఓ శ్రీనివాసులు గుర్తించి పోలీసులకు సమాచ్చారం అందించారు.విషయం తెలుసు కొన్న నాయుడుపేట సిఐ బాబి తనసిబ్బందితో కలిసి మామిడికాలువ వద్దకు చేరుకొని మృతదేహన్ని పరిశీలించారు.మృతదేహం గుర్తుపట్టలేని విద్దంగా కుళ్ళిపోయి ఉండటంతో పంచనామ నిమిత్తం నాయుడుపేట ప్రభుత్వ వైధ్యశాలకు తరళించారు.నాయుడుపేట పోలీసులు కేసు ధర్యాప్తు చేస్తున్నారు.

## ఎన్టీఆర్ విగ్రహ ఏర్పాటుకు స్థలపరిశీలన

నాయుడుపేట, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త



నాయుడుపేట పట్టణంలోని సిఎస్‌తేజ సెంటర్‌లో మాజీముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు విగ్రహాన్ని ఏరా ్పటు చేసేందుకు మాజీఎంపి నెలవల సుబ్రమణ్యం తెదేపా నాయకులతో కలిసి ఆదివారం స్థలాన్ని పరిశీలించారు. రామారావు విగ్రహాన్ని నాయుడుపేట పట్టణంలోని సిఎస్‌తేజ సెంటర్‌లో మన్సిపాల్టి స్థలంలో ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.మాజీముఖ్యమంత్రి ఎన్టీఆర్ జయంతి నాటికి నాయుడుపేటలో ఆయన విగ్రహాన్ని ప్రతిష్టంచనున్నట్లు తెలియజేశారు.ఆయన వెంట మండల తెలుగుదేశంపార్టీ అధ్యక్షుడు సన్నారెడ్డి చంద్రారెడ్డి,పట్టణ అధ్యక్షుడు 786రఫి,సంచి కృష్ణయ్య,ఎంపిటిసి పల్లమాల రామిరెడ్డి,తదితర నాయకులు,కార్యకర్తలు ఉన్నారు.

# గూడూరు డివిజన్

## ప్రతిరోజు ఇంటింటికి వెళ్లి చెత్త సేకరణ

బాలాయపల్లి, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త



ప్రతిరోజు ఇంటింటికి వెళ్లి చెత్తను సేకరిస్తామని పిఓపిఆర్డి దయాకర్ తెలిపారు. మండలంలోని చుట్టి గ్రామంలో పంచాయతీ సిబ్బంది ఇంటింటికి వెళ్లి చెత్తను సేకరించే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చెత్తను రోడ్లమీద వేయకుండా పంచాయతీ సిబ్బంది వస్తే వారికి ఇవ్వాలని తెలిపారు. చెత్తను పంచాయతీ సంపద కేంద్రాలకు తరలిస్తారని తెలిపారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు వీధుల్లో చెత్తాచెదారో వేయరాదని, మురుగునీటిని వీధుల్లో వదలరాదని సూచించారు. ఈ కార్యక్రమంలో సెక్రెటరీ మోహన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

## గృహాల నిర్మాణాల్లో అక్రమాలు జరిగాయని కలెక్టర్‌కు ఫిర్యాదు

వెంకటగిరి, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త

14 వ వార్డులోనీ లబ్ధిదారులకు మంజూరు చేసిన జగనన్న లేఔట్ గృహాల్లో అక్రమాలు జరిగాయని 14వ వార్డ్ కౌన్సిలర్ ఆరి శంకరయ్య జిల్లా కలెక్టర్, సబ్ కలెక్టర్లకు ఫిర్యాదు చేశారు. తాను సమాచార హక్కు చట్టం కింద గృహాలు ఎన్ని మంజూరయ్యా అని, వాటికి సిమెంటు కమిటీ బిల్లులు ఎంత చేశారని వివరాలు అడగ్గా తప్పులు ,తడకగా ఇచ్చారని చెప్పారు. సిమెంటు, కమ్యూని లబ్ధిదారులకు ఇవ్వకనే సిబ్బంది, స్వాహ చేసినట్లు ఆరోపించారు. హౌసింగ్ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

## తిరుమలకు పాదయాత్రగా బయలుదేరిన భక్త బృందం

బాలాయపల్లి, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త



ఏసీ సుబ్బారెడ్డి కూరగాయల మార్కెట్ భక్త బృందం మాల్యం మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో నెల్లూరు నుంచి తిరుపతికి ఆదివారం బయలుదేరారు. జరుగుతున్న పాదయాత్రలో భాగంగా మండల కేంద్రమైన బాలాయపల్లి లోని శ్రీ కోదండ రామస్వామి దేవాలయంలో స్వామివారిని దర్శించుకుని అక్కడ కొద్దిసేపు భక్త బృందం సేద తీరారు. మహాశివరాత్రి పర్వదినం ఈ ఏడాది శ్రవణా నక్షత్రం రోజు వచ్చినట్లు అందరూ అందరూ శివాలయాలకు వెళ్తారని, మా భక్త బృందం వారు వెంకటేశ్వర స్వామిని మహాశివునిగా భావించి వెళ్తున్నట్లు తెలిపారు. ఎంఎంఆర్ ఆధ్వర్యంలో మాల్యం మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో, ఏసీ సుబ్బారెడ్డి కూరగాయల మార్కెట్ భక్త బృందం వారు నెల్లూరు అన్నమయ్య సర్కిల్ శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం నుంచి బయలుదేరారు. మాల్యం మధుసూదన్ రెడ్డి వారు భోజన వసతి సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు.వరుసగా 6వసారి ఈ పాదయాత్ర చేస్తున్నట్లు భక్త బృందం తెలిపారు. దేవుడు కరుణిస్తే మరలా మరలా పాదయాత్ర చేస్తామని వారు తెలిపారు.

## రుణాల మంజూరుకు 25న ఇంటర్వ్యూలు



వెంకటగిరి, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త

పట్టణ పరిధిలోని బీసీ రుణాల కోసం దరఖాస్తులు చేసుకున్న వారికి ఈనెల 25, 27 తేదీల్లో వెంకటగిరి మున్సిపల్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు కమిషనర్ వెంకట్రామిరెడ్డి తెలిపారు. ఉదయం 10 గంటల నుండి బ్యాంక్ అధికారులు, మున్సిపల్ సిబ్బంది ఇంటర్నేషనల్ 25వ తేదీ ఒకటో వార్డు నుండి 12వ వార్డు వరకు, 27వ తేదీ 13వ వార్డు నుండి 25 వ వార్డు వరకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రుణాల కోసం దరఖాస్తు చేసుకున్నవారు ఇంటర్వ్యూలకు హాజరుకావాలని కోరారు.

## ఆప్కాస్ రద్దు చేసి ప్రైవేటు ఏజెన్సీలకు ఇచ్చే పద్ధతిని విరమించుకోవాలి : సి.ఐ.టి.యు

గూడూరు, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పొరుగు సేవల కార్మికులకు సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమానవేతనం చెల్లిస్తుందని, ఉద్యోగాలు పర్మినెంట్ చేస్తుందని, మున్సిపల్ పారిశుధ్య కార్మికులు ఎంతగానో ఆశించడం జరిగిందని, కాని అప్కాస్ రద్దుచేసి ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించే ఆలోచన విరమించుకోవాలని నాయకులు డిమాండ్ చేశారు. మున్సిపల్ సంఘము ఉపాధ్యక్షులు ఆలూరు పెంచల ప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ ప్రైవేట్ ఏజెన్సిలకు ఇస్తే రోజు వారి వేధింపులు, పెత్తనం, బెదిరింపులు, వేతనాలు సహకారంతో చెల్లించరని, పి.ఎఫ్ ఇ.ఎస్.ఐ నిధులు గోల్ మాల్ అయ్యే ప్రమాదం ఉందని, కావున ఆప్కాస్ విధానాన్ని రద్దుచేసి ప్రైవేటు ఏజెన్సీలు ఇచ్చే మంత్రివర్గ ప్రతిపాదన లను వెంటనే విరమించుకోవాలని, అప్కాస్ ఉద్యోగులందరినీ పర్మినెంట్ చేయాలని వారు డిమాండ్ చేశారు. తిరుపతి జిల్లా గూడూరు లోని ఏ.పీ.మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సి.ఐ.టి.యు) అనుబంధం ఆధ్వర్యంలో మున్సిపల్ పారిశుధ్య కార్మికులు ఆదివారం రోజు సి.ఐ.టి.యు కార్యాలయం నుండి ర్యాలీగా బయలుదేరి వివేకానంద రోడ్డు మీదగా, ముత్యాల పేట నుండి, గమళ్ళపాలెంలోని, గూడూరు నియోజకవర్గము శాసనసభ్యులు డాక్టర్ పాశం సునీల్ కుమార్ క్యాంప్ కార్యాలయం చేరుకొని నిరసన వ్యక్తం చేసి కార్యాలయ సిబ్బందికి వినతి పత్రం సమర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎ.పి.మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ తిరుపతి జిల్లా కార్యదర్శి బి.గోపినాథ్, గౌరవాధ్యక్షులు జోగి. శివకుమార్, పట్టణ కార్యదర్శి డి.కోటేశ్వరరావు, ఎన్. వెంకటరమణ, సి.రాజేష్, జి.మణి, టి.రాఘవ, సంపూర్ణమ్మ, మణెమ్మ, నారాయణమ్మ, పెంచలమ్మ, గూడూరు పట్టణ సి.ఐ.టి.యు నాయకులు బీ.వీ.రమణయ్య, యస్. సురేష్, అడపాల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు



గూడూరు, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త

గూడూరు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో జోన్ ఛైర్మన్ కె. ఆదిశేష రెడ్డి క్లబ్ సేవ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా పలు సేవా కార్యక్రమంలో నిర్వహించారు. ఆదిశేష రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో సీనియర్ క్లబ్ అయినా గూడూరు క్లబ్ సేవలు ప్రశంసనీయమని, క్లబ్ సేవలను ఆదర్శనీయంగా తీసుకుంటామని తెలిపారు. లయన్స్ డిస్ట్రిక్ట్ ఛైర్మన్ షేక్ రియాజ్ అహ్మద్ మాట్లాడుతూ మనిషి, మనిషి సంపాదించిన డబ్బు శాశ్వతం కాదని సేవతోనే తృప్తి చెందగలుగుతామని తెలిపారు. క్లబ్ అధ్యక్షుడు ఆర్ రవిచంద్ర అధ్యక్షతన జరిగిన పలు కార్యక్రమంలో సరస్వతి శిశు మందిరము నందు పేదలకు సరుకులు, చీరలు దుప్పట్లు పంచడమే కాకుండా లయన్ రవిచంద్ర దాతృత్వంతో పేద మహిళలకు జీవన భృతి కొరకు బండి కొట్టు నిర్వహించుటకు సరుకులను అందించారు. లయన్ ఎం. రాధాకృష్ణ దాతృత్వంతో సాయిరాం వృద్ధాశ్రమం నందు వృద్ధులకు అన్న ప్రసాదము, క్లబ్ కార్యదర్శి కే. శివయ్య దాతృత్వంతో వృద్ధాశ్రమంకు మిక్సీ అందించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ చైర్మన్లు షేక్ రియాజ్ అహ్మద్, మల్లెమాల మురళి రెడ్డి, వాకాటి రామ్మోహన్, రూపేష్ రెడ్డి, మదన మేటి రమణయ్య, కళ్యాణ సాయి, బాలాజీ, సులూరుపేట లయన్స్ క్లబ్ అధ్యక్షులు, మహిళా మెంబర్లు పాల్గొన్నారు.

## విద్యార్థులలో సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించడమే శ్రీ గాయత్రి స్కూల్ లక్ష్యం

గూడూరు, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త



గూడూరు పట్టణంలోని శ్రీ గాయత్రి ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు టెక్నికల్ నాలెడ్జ్ హంట్‌లో భాగంగా, రాష్ట్రస్థాయిలో గుర్తింపు కలిగిన ఎన్‌బికెఆర్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ టెక్నాలజీ సందర్శించి ఇంజనీరింగ్‌లో గల వివిధ శాఖలు, అనుబంధ ప్రయోగశాలలు, ఉపకరణాలు, రోబోటిక్ టెక్నాలజీ, ఏఐ ల్యాబ్ విశిష్టతలు తెలుసుకోవడం జరిగింది. ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్ రెడ్డి మట్లాడుతూ నేటి విద్యార్థులు భవిష్యత్ ఇంజనీర్లు శాస్త్రవేత్తలు వారికి సాంకేతిక పరిజ్ఞానం అందించి విద్యార్థులను ప్రోత్సహిస్తున్న శ్రీ గాయత్రి ఇంగ్లీష్ మీడియం స్కూల్ కరస్పాండెంట్ శివకుమార్ రెడ్డి, ఉపాధ్యాయుల ఆలోచనలు అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎన్‌బికెఆర్ కళాశాల ప్రొఫెసర్లు, వివిధ విభాగాధిపతులు, స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## వాటంబేడులో 25 నుంచి శివరాత్రి మహోత్సవాలు

తడ, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త



తడ మండలం వాటంబేడులోని చారిత్రక ప్రసిద్ధి చెందిన ప్రసన్న విశాలాక్షి సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 25 నుంచి మహాశివరాత్రి మహోత్సవాలు ఘనంగా జరుపుతున్నట్లు ఆలయ అర్చకులు దివి సుబ్బా రావు, కార్యనిర్వహణ అధికారి కె.మమతలు తెలిపారు. సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, రాష్ట్ర బిసి సాధికార సమితి సభ్యులు బొమ్మన్ పళణి, ఎంపిటిసి కారికాటి మునెమ్మ, సర్పంచ్ కారిజాత మహాలక్ష్మిల ఆధ్వర్యంలో గ్రామపెద్దల, ఉభయకర్తల సహకారంతో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. 25న సాయంత్రం నందిపూజ, గణపతి హోమం, 26న స్వామివారికి రుద్రాభిషేకం, మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం సర్వదర్శనం, రాత్రి కోలాట నృత్యాలు ఏర్పాటు చేశామన్నారు. 27 తెల్లవారుజామున లింగోద్భవ పాలాభిషేకంతో పాటు మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం వైభవంగా కల్యాణోత్సవం, గ్రామోత్సవం జరుపుతున్నామని ఉత్సవ కమిటీ సభ్యులు పోలూరు మోహన్‌రెడ్డి, బొమ్మన్ జయరామయ్య, వాటంబేడు హరినాథరెడ్డి, కిలివేటి దశరథ, తాంగి ప్రభు, దూడల నాగరాజులు పేర్కొన్నారు.

అండగుండల ఆలయంలో..

తడ మండలం అండగుండల మార్గంలోని శ్రీనాగలింగేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 25, 26, 27 తేదీల్లో మహాశివరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో జరుపుతున్నట్లు ఆలయ కమిటీ ఛైర్మన్ జక్కల నాగేశ్వరరావు, కమిటీ సభ్యులు తెలిపారు. మొదటి రోజు గోపూజ, ధ్వజారోహణంతో పాటు 26న భక్తుల స్వహస్తాలతో స్వామివారికి పాలాభిషేకం జరుగుతుందన్నారు. మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం భజన కార్యక్రమాలు ఉంటాయని, అర్ధరాత్రి లింగోద్భవ కాల పూజలు నిర్వహిస్తామని తెలిపారు. 27న పార్వతీదేవి సమేత నాగలింగేశ్వరస్వామివార్ల కల్యాణోత్సవం జరుగుతుందన్నారు. భక్తులు ఈ ఆలయానికి విచ్చేసి వసంతోత్సవంలో కూడా పాల్గొనాలని కోరారు.

## భక్తజన పరవశం..గూడలి కొండ

కోట, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త



ప్రకృతి రమణీయ సుందర దృశ్యాలకు కోట మండలం గూడలి కొండ చిరునామాగా నిలుస్తుంది. ఈ నెల 26న మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని భీమేశ్వరస్వామి ఆలయంలో శివనామ స్మరణతో మార్మోగనుంది. శివరాత్రికి స్వామివారిని భక్తులు స్వామివారిని దర్శించుకుంటా. ఇక్కడి విశేషాలు తెలుసుకొని భక్తులు ఆనందభూతి పొందుతారు. కాలిబాటన కొండపైకి వెళ్లేవారు సుమారు 200 మెట్లు ఎక్కి స్వామివారిని దర్శించుకోవాలి. కొండపైకి ఆటోలు, ఇతర వాహనాలు వెళతాయి. కొండపైన శివరాత్రి బ్రహ్మోత్సవాలు గత కొన్నేళ్లుగా నేదురుమల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఛైర్మన్ నేదురుమల్లి రామ్ కుమార్‌రెడ్డి ఘనంగా నిర్వహించే వారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఈ సారి గూడలి కొండపై తామే శివరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తామని కూటమి నాయకులు చెప్పారు. ఆ మేరకు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ సూచనలతో ఈ ఉత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు నల్లపరెడ్డి జగన్మోహన్‌రెడ్డి చెప్పారు. ఆ రోజు అన్నప్రసాదం నిర్వహిస్తామన్నారు.

## సూర్యప్రభవాహనంపై స్వామి: సప్పరంలో అమ్మవారి దివ్యదర్శనం

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహిస్తున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం స్వామి వారిని సూర్యప్రభవాహనంపై దేవేరి జ్ఞాన ప్రసూనాంబ అమ్మవారిని సప్పర వాహనంపై ప్రతిష్టించి గ్రామోత్సవం నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయంలో ఓ వైపు భక్తుల తాకిడి మరో వైపు అతిథుల తాకిడి పెరిగింది. అధికారులు సిబ్బంది వచ్చిన భక్తులకు సుదర్శనం భాగ్యం కల్గిస్తూ శివరాత్రి ఏర్పాట్లను నిర్వహించారు.ఉదయం స్వామి అమ్మవార్లను చక్కగా అలంకార మండపంలో అలంకార గురుకుల్ సూరి ముస్తాబు చేసారు.ఇక్కడ స్వామి అమ్మవార్ల ఉత్సవర్లకు ఆలయ ఇఓ టి.బాపిరెడ్డి పూజలు జరపగా సంప్రదాయబద్ధంగా అర్చకులు హారతులిచ్చి స్వామి అమ్మవార్లను గ్రామోత్సవాలకు తరలిం చారు. పంచమూర్తులను శివయ్య గోపురం, రాజగోపురం గుండా అలంకార మండపం వద్దకు చేర్చారు.అక్కడ సోమస్కందమూర్తి శ్రీకాళహస్తీశ్వరుని సూర్యప్రభ వాహనంపై, దేవేరి జ్ఞానప్రసూనాంబ అమ్మవారిని సప్పర వాహనంలో ప్రతిష్టించారు. స్వామి అమ్మవార్లకు దిష్టి తీసి గ్రామోత్సవానికి శ్రీకారం చుట్టారు. కోలాటాల కళాకారులు సంప్రదాయబద్ధంగా కోలాటాల నృత్యాలు చేస్తుండగా మేళతాళాలు మంగళవాయిద్యాలతో ఉభయదారులు వెంటరాగా ఉత్సవం నాలుగుమాడావీధులతో పాటు బాబూఅగ్రహారం కోనేరు చుట్టూ ఉత్సవం నిర్వహించారు. కార్యక్రమాల్లో ఇఇ మురళీధర్‌రెడ్డి, డెప్యూటీ ఇఓ ఎన్ ఆర్ కృష్ణారెడ్డి,శానిటరీ ఇన్స్పెక్టర్, ఎఇఓలు సతీష్‌మాలిక్,లోకేష్‌రెడ్డి, టెంపుల్ ఇన్స్పెక్టర్లు హరియాదవ్, వెంకటమునిరెడ్డి సుదర్శనం, ఎఇఓ విద్యాసాగర్‌రెడ్డి పర్యవేక్షణలో,వారి సిబ్బంది పర్యవేక్షించారు. ఈ కార్యక్రమాలకు ఎంఎల్ఏ మాతృమూర్తి బొజ్జలబృందమ్మ, మాజీ మార్కెట్ కమిటి ఛైర్మెన్ రంగినేని చెంచయ్యనాయుడు, పట్టణ పార్టీ అధ్యక్షుడు జి.విజయకుమార్,పట్టణ తెలుగుదేశం మహిళ అధ్యక్షురాలు సుమతి మల్లిశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## ధూర్జటి కళా ప్రాంగణంలో ఆకట్టుకుంటున్న నృత్యప్రదర్శనలు



శ్రీకాళహస్తిరూరల్, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి మహాశివరాత్రి ఉత్స వాల్లో భాగంగా ధూర్జటి కళా ప్రాంగణంలో నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను, స్థానికులకు విశేషంగా ఆకర్షిస్తున్నా యి. శివజ్ఞ శివానీ నాట్యాలయం గురువు అరుణ ఆధ్వర్యంలో చిన్నా రులు గీతికాకృష్ణ, ఖ్యాతి, దీక్షిత, నైనిత, పూర్విక, ప్రీతిక, మనస్విని, యశ్విత, సహస్రలు చక్కగా భరత నాట్యం చేశారు. శివ శివ భవ భవ అన్న పాటలకు ఎంతో చక్కగా నాట్యం చేసి భక్తుల మన్ననలు పొందారు వీరికి దేవస్థానం అధికారులు స్వామిఅమ్మవార్ల తీర్థప్రసాదాలతోపాటు ప్రశంసాపత్రాలను అందించి సత్కరించారు.

## యాగశాలలో పూజలు



(ప్రభాతవార్త–శ్రీకాళహస్తి)

శ్రీకాళహస్తీశ్వరాలయంలో జరుగుతున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఆలయంలో ఏర్పాటు చేసిన యాగశాల వద్దకు వెళ్ళి పూజలు జరుపుకున్నారు.ఆలయ డెప్యూటి ఇఓ ఎన్ ఆర్ కృష్ణారెడ్డిచే సంకల్పం చేసుకున్నారు.అలంకార మండపంలో ఉదయం ఉత్సవానికి సిద్దం చేసిన స్వామి అమ్మవార్లను పంచమూర్తుల్ని దర్శించుకున్నారు. యాగశాల వద్ద సంకల్పం అయిన తరువాత ఆలయ దీక్షా గురుకుల్ డాక్టర్ అయ్యావు గురుకుల్‌నుదట బొట్టు పెట్టి ఆశీర్వదించారు.తరువాత యాగశాలలో కలశాలను ఏర్పాటు చేసారు. శాస్త్రోక్తంగా స్థానిక సంప్రదాయం మేరకు డాక్టర్ స్వామినాధన్ గురుకుల్ పూజలకు శ్రీకారం చుట్టారు. 12రోజుల పాటు ఈ యాగశాల ఉంటుంది.ప్రతిరోజూపూజలు నిర్వహిస్తారు.ఈ కార్యక్రమాల్లో డెప్యూటి ఇఓతో పాటు టూటౌన్ సిఐ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీకాళహస్తీశ్వరాలయంలో లైటింగ్ అదరహో!

### ఊరూ వాడ విద్యుత్ దీపాల శోభ



దక్షిణ గోపురం వద్ద లైటింగ్ శోభ,దక్షిణామూర్తి ఆలయం నుంచి కంచుగడప వరకు లైటింగ్

(ప్రభాతవార్త–శ్రీకాళహస్తి)

శ్రీకాళహస్తీశ్వరాలయంలో లైటింగ్ అదరహో అన్నట్లు మారింది.శ్రీకాళహస్తి శాసనసభ్యుడుగా కూటమి అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డి శివరాత్రి బ్రహ్మోత్సవాలను గతం కన్నా భిన్నంగా నిర్వహించాలని నిర్ణయించారు. గతంలో ఏటా ఆలయంల లైటింగ్‌కుటెండర్ల ముసుగులో లక్షలకు లక్షలు ఖర్చుపెట్టె వారు. ఈ ఏడాది యువకుడైన శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి తనకు గల స్నేహాలతో 'ఏ ఎం ఆర్' నిర్వాహకులతో సంప్రదించారు. వారు రూ.కోటి ఇవ్వటానికి సుముఖత వ్యక్తం చేసారు.దాంతో శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి లైటింగ్ రంగంలో నిష్ణాతులైన ముంబాయికి చెందిన భరత్ లైటింగ్ సంస్థతో చర్చలు జరిపారు. వారి ద్వారా ఆలయంలో శాశ్వత లైటింగ్‌కు శ్రీకారం చుట్టారు.దాంతో ప్రతి ఏటా రూ.10 నుంచి 15లక్షల ఖర్చు తగ్గింది. అయితే ఆలయంలో కొత్త లైటింగ్ శోభాయమానంగా మారింది. ఆలయం లోపల 290 పిల్లర్లకు లైటింగ్‌ను ఏర్పాటు చేసారు.అలాగూ బయట సుమారు 150 పిల్లర్లకు శాశ్వత లైటింగ్‌ను ఏర్పాటు చేసారు.అలాగే ఆలయానికి సంబంధించిన నాలుగుగోపురాలకు కన్నులుమిరుమిట్లు గొల్పునట్లు లైటింగ్‌ను శోభాయమానంగా తీర్చిదిద్దారు.

## ఎగువ కన్నికాపురంలో ప్రశాంతంగా పశువుల పండుగ

వెదురుకుప్పం, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త :



మండలంలోని గంటావారిపల్లె పంచాయితీ పరిధిలోగల ఎగువ కన్నికాపురం గ్రామంలో ఆదివారం పశువుల పండుగ వైభవంగా ప్రారంభించారు. గ్రామస్థులు వారం రోజుల పాటు పశువుల పండుగలకు కావసిన వసతులు, సౌకర్యాలు కల్పించారు. ఉదయం చుట్టు ప్రక్కల గ్రామాల నుంచి ఎద్దుల యాజమానులు పెద్ద సంఖ్యలో గిత్తలు తీసుకుని కన్నికాపురం చేరుకోవడంతో సంబరాలు అంబరాన్ని అంటాయి. వందల సంఖ్యలో గిత్తలు,వేల సంఖ్యలో వీక్షకులు, బరిలోకి దిగే యువకులు చేరుకోవడంతో పశువుల ఆట మొదలైయింది. గ్రామస్థులు నడివీధిలో పూజలు చేసి అల్ల ఏర్పాటు చేసి గిత్తలు పోటీ ప్రారంభించారు.... సంబరాలలో కొడేగిత్తలు రంకేలు వేయడంతో యువకులు పౌరుషంతో బరిలోకి దిగడంతో జలికట్టు సంబరాలు అంబరాన్ని తాకాయి. గిత్తలు చేసిన సందడిని మిద్దేల పై నుంచి వీక్షించిన చూపరులకు కనులవిందు చేసింది. పలు గ్రామాల్లో నుంచి గిత్తలు పోటీలకు తీసుకు వచ్చి దించడంతో వీక్షులతో జనసంద్రంగా మారిపోయింది. పాతగుంటలో జరిగిన గిత్తల పోటీలు రసవత్తంగా సాగాయి. చెదురు మదురు సంఘటలు మినహా పోటీలు రసవత్తంగా జరిగాయి.

## నాగలాపురం యూనియన్ బ్యాంకులో నగలు మాయం

నాగలాపురం, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త:

నాగలాపురం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో గోల్‌మాల్ జరిగినట్టు ఎస్ఐ సునీల్ తెలిపారు. ఈ సందర్భంగా విలేకరులతో ఎస్ఐ మాట్లాడుతూ బ్యాంకు డిప్యూటీ మేనేజర్ సూర్యతేజ 67 ఖాతాల్లో నగలను తన స్వార్థానికి వాడుకున్నట్టు పేర్కొన్నారు. 37 ఖాతాల నగలను అదే బ్యాంకులో ఇతరుల పేరున తాకట్టు పెట్టి రుణం పొందాడన్నారు. మరో 30 ఖాతాల నగలను ఇతర ప్రైవేటు బ్యాంకులో తాకట్టు పెట్టి స్వాహ చేసినట్టు ఎస్ఐ పేర్కొన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## భక్తులతో కిటకిటలాడిన కాణిపాకం ఆలయం

కాణిపాకం, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త:



కాణిపాకం శ్రీవరసిద్ది వినాయక స్వామి ఆలయం ఆదివారం భక్తులతో పోటెత్తింది. సాధారణంగా ఆలయం లో వారంతపు రోజులు శని, ఆదివారాలు, వరుస సెలవు రోజుల్లో భారీ స్థాయిలో రద్దీ వుంటుంది. ఈమేరకు ఆదివారం ప్రభుత్వ సెలవుదినం కావడంతో వివిధ ప్రాంతాల నుండి భక్తులు అనూహ్యంగా ఆలయ దర్శనార్థం పెద్దఎత్తున తరలివచ్చారు.అలాగే సాధారణ భక్తులతో పాటు తిరుమల తీర్థజనం కూడా కాణిపాకం స్వామివారి దర్శనార్థం రావడంతో ఆలయంలో ఉదయం నుండి రాత్రి వరకు తీవ్రస్థాయిలో రద్దీ నెలకొంది.